జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
బుధవారం 24 జూన్ 2026 పేజీలు : 8



# సింగరేణి రిటైర్మెంట్ కార్మికులకు ప్రత్యేక పెన్షన్ ప్యాకేజీ అవసరము



సింగరేణి రిటైర్మెంట్ ఉద్యోగులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా సమగ్ర పెన్షన్ ప్యాకేజీ కల్పించాలని సింగరేణి రిటైర్మెంట్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కొమురం భీం జిల్లా రెబ్బెన మండలంలోని గోలేటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ అజ్మీర వీరన్నకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు బ్రాంచ్ మేనేజర్‌ను శాలువాతో ఆత్మీయంగా సన్మానించారు.

# మంచిర్యాల బస్టాండ్ మార్కెట్ ఏరియాలో షెడ్ల తొలగింపు కలకలం

జీవనోపాధి కోల్పోయిన చిరు వ్యాపారుల ఆవేదన అభివృద్ధి ఒకవైపు, ఉపాధి మరోవైపు

షెడ్లు కూలాయి... జీవితాలు కూలిపోతున్నాయా..? బాధ్యత ఎవరిది..?

మంచిర్యాలలో వందలాది చిరు వ్యాపారుల ఆవేదన



# చెన్నూర్ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు



జిల్లాలోని చెన్నూర్ నియోజక వర్గంలో అన్ని రంగాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభు త్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. జిల్లాలోని కోటపల్లి మండలం లింగన్న పేట, ఏదుల బంధం, సిర్స, రొయ్యలపల్లి, ఆల్గాం, వెంచపల్లి గ్రామా ల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, మండల తహసీల్దార్ రాఘు వేంద్ర, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, డీసీసీ ప్రతినిధి రఘునాథ్ రెడ్డితో కలిసి మంత్రి మంగళవారం భూమిపూజను నిర్వహించారు.



# వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం



**మంచిర్యాల, 23, జూన్ (ప్రజాజ్యోతి):** వ్యవసాయ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీకేఎంయూ (బి కే ఎం యు) ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీకేఎంయూ జాతీయ సమితి సభ్యుడు అక్కెపల్లి బాపు, జిల్లా కార్యదర్శి గుండా చంద్రమాణిక్యం లు మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి ప్రతి సంవత్సరం రూ.2.5 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. వీఎల్ఈ/వీబీజీ విధానాలను రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉపాధి హామీ కూలీలకు ప్రతి సంవత్సరం 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.700 వేతనం చెల్లించాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, వైద్య సదుపాయాలు వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అలాగే అర్హులైన వ్యవసాయ కార్మికులకు ప్రతి నెల రూ.6 వేల పింఛన్ అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు గుండా శంకర్, రత్నం రాజం తదితరులు పాల్గొన్నారు.

# నూతన జిల్లా పే అండ్ అకౌంట్స్ అధికారికి టీఎన్జీవో ఆధ్వర్యంలో ఘన సన్మానం



**మంచిర్యాల, 23. జూన్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా పే అండ్ అకౌంట్స్ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీమతి ఎల్. రమ గారిని టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో ఆమె విజయవంతంగా ముందుకు సాగాలని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి బొడ్డు శ్రావణ్ కుమార్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షులు తిరుపతి రాంకుమార్, సంయుక్త కార్యదర్శి సునీత, మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు అజయ్, మోసిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

# "సేవ్ మణుగూరు" కు సంఘీభావం తెలిపిన కురి రాజేశ్వరరావు

## మణుగూరు బొగ్గు గనులను ప్రైవేటీకరించొద్దు




**మంచిర్యాల, 23, జూన్ (ప్రజాజ్యోతి):**సేవ్ మణుగూరు ఉద్యమం ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరాహార దీక్షల శిబిరాన్ని సింగరేణి మాజీ విశ్రాంత ఉద్యోగి, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కేంద్ర కమిటీ నాయకుడు, సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కురి రాజేశ్వరరావు మంగళవారం సందర్శించి తమ సంపూర్ణ సంఘీభావం, మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వందేళ్ల చరిత్ర కలిగి అపారమైన బొగ్గు నిల్వలతో దేశానికి సేవలంది స్తున్న మణుగూరు ప్రాంతం నేడు కేంద్ర, రాష్ట్ర రాజకీయాలకు బలిపశువుగా మారడం దురదృష్టకరమన్నారు. జాతీయ బొగ్గు గనుల వేలం ప్రక్రియలో భాగంగా మణుగూరు పీకే ఓసీ, సైడ్ డీపి ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. వన్ ఆఫ్ 70 చట్టం అమల్లో ఉన్న ప్రాంతాల్లో ప్రైవేటు సంస్థలకు గనులను అప్పగించే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనమైన సమయంలో తెలంగాణ బొగ్గు గనులు, ప్రజా రంగ సంస్థలను ప్రైవేటీకరించరాదని నిజాం ప్రభుత్వం సర్దార్ వల్లభభాయ్ పటేల్‌ను కోరిన విషయాన్ని గుర్తు చేశారు. సింగరేణి కాలరీస్ తెలంగాణ ప్రజల ఆస్తి అని, వేలాది మంది కార్మికుల త్యాగాలు, పోరాటాలు, ప్రాణత్యాగాల ఫలితంగా ప్రజా రంగ సంస్థగా రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సింగరేణి వెన్నెముకలాంటిదని, దీనిపై సర్వహక్కులు రాష్ట్ర ప్రభుత్వానికే ఉన్నాయని అన్నారు. మణు గూరు ప్రాంత బొగ్గు గనులను ప్రైవేటీకరించే ప్రయత్నాలను ప్రజలంతా ఐక్యంగా వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. సేవ్ మణుగూరు ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నూతన డీఆర్వో మోతి రామ్‌కు టీఎన్జీవో ఆధ్వర్యంలో ఘన సన్మానం



**మంచిర్యాల, 23, జూన్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మోతి రామ్‌ను టీఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మోతి రామ్ తనపై చూపిన అభిమానానికి టీఎన్జీవో నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, పరిపాలనా వ్యవస్థ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి బొడ్డు శ్రావణ్ కుమార్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షుడు తిరుపతి రాంకుమార్, సంయుక్త కార్యదర్శి సునీత, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు అజయ్, మోసిన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యునిగా పి. మాధవ నాయక్ నియామకం



**మంచిర్యాల, 23, జూన్ (ప్రజాజ్యోతి):** భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) జాతీయ నాయకులు కొత్తకాపు లక్ష్మారెడ్డి కోల్ ఇండియా మరియు సింగరేణి యాజమాన్యాలకు ఈ–మెయిల్ ద్వారా పి. మాధవ నాయక్‌ను నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యునిగా నామినేట్ చేసినట్లు మంగళవారం అధికారికంగా తెలియజేశారు. ఈ నియామకానికి సంబంధించిన ఆదేశాలు తక్షణమే అమల్లోకి రానున్నట్లు తెలిపారు .ఈ సందర్భంగా పి. మాధవ నాయక్ మాట్లాడుతూ ,తనపై విశ్వాసం ఉంచి జాతీయ స్థాయి కమిటీలో ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశాన్ని కల్పించిన కొత్తకాపు లక్ష్మారెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహిస్తూ కార్మికుల సంక్షేమం, భద్రత మరియు ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు. అలాగే సింగరేణిలో భారతీయ మజ్దూర్ సంఘ్ సిద్ధాంతాలను మరింత బలోపేతం చేయడంతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిని కొనసాగిస్తానన్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్‌లో నిస్వార్థంగా, క్రమశిక్షణతో పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని ఈ నియామకం మరోసారి నిరూపించిందన్నారు. కార్మిక సంక్షేమం, పరిశ్రమల ప్రగతి, దేశాభివృద్ధి అనే బీఎంఎస్ మూల సిద్ధాంతాలను ఆచరిస్తూ ప్రతి కార్యకర్త బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టీఎస్ పవన్ కుమార్ (చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మరియు స్టాండడైజేషన్ కమిటీ సభ్యులు), జీవీ కృష్ణారెడ్డి (కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ), ఏ. వెంకటేశ్వర్లు (కేంద్ర ఉపాధ్యక్షులు), బి. రామ్ సింగ్ (కార్పొరేట్ ఏరియా ఉపాధ్యక్షులు), మొగిలిపాక రవి (కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు), కాసర్ల మోహన్ (కొత్తగూడెం ఏరియా కార్యదర్శి) పాల్గొన్నారు.

# సింగరేణి రిటైర్మెంట్ కార్మికులకు ప్రత్యేక పెన్షన్ ప్యాకేజీ అవసరము

## ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌కు సింగరేణి రిటైర్మెంట్ కార్మికుల వినతి

**మంచిర్యాల, 23. జూన్ (ప్రజాజ్యోతి):** సింగరేణి రిటైర్మెంట్ ఉద్యోగులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా సమగ్ర పెన్షన్ ప్యాకేజీ కల్పించాలని సింగరేణి రిటైర్మెంట్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కొమురం భీం జిల్లా రెబ్బెన మండలంలోని గోలేటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ అజ్మీర వీరన్నకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు బ్రాంచ్ మేనేజర్‌ను శాలువాతో ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బూడిది గోపాలకృష్ణ మాట్లాడుతూ, సింగరేణి కాలరీస్ కంపెనీలోని బొగ్గు గనుల్లో 30 నుంచి 40 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా సేవలందించిన రిటైర్మెంట్ కార్మికులు ప్రస్తుతం కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సి.ఎం.పి.ఎఫ్) ద్వారా పెన్షన్ పొందుతున్నారని తెలిపారు. దశాబ్దాల తరబడి దేశాభివృద్ధికి, సంస్థ అభివృద్ధికి తమ జీవితాలను అంకితం చేసిన కార్మికులకు ప్రత్యేక పెన్షన్ ప్యాకేజీ అవసరమని అన్నారు. కార్మికుల వయస్సు, ఆరోగ్య పరిస్థితులు, ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని జాతీయ బ్యాంకులు పెన్షనర్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని కోరారు. రిటైర్మెంట్ కార్మికులు బ్యాంకుల్లో ఖాతాలు నిర్వహించడం, ఫిక్స్డ్ డిపాజిట్లు చేయడం వల్ల వారికి ప్రత్యేక సమగ్ర పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్మెంట్ కార్మికులకు ఉచిత వ్యక్తిగత ప్రమాద బీమా సౌకర్యం, తక్కువ ప్రీమియంతో ఆరోగ్య బీమా పథకం, ఫిక్స్డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ, బ్యాంకింగ్ సేవలపై సర్వీస్ ఛార్జీల మినహాయింపు, ఉచిత డెబిట్ కార్డులు, చెక్‌బుక్కులు, ఎస్ఎంఎస్ అలర్టులు, తక్కువ వడ్డీతో వ్యక్తిగత రుణాలు, వృద్ధులకు డోర్ స్టెప్ బ్యాంకింగ్ సేవలు, ప్రత్యేక హెల్ప్‌డెస్క్ సేవలు కల్పించాలని కోరారు. ఈ పథకాలు అమలు



లోకి వస్తే సింగరేణిలో పనిచేసిన దాదాపు 40 వేల నుంచి 60 వేల మంది రిటైర్మెంట్ కార్మికులకు ఉపయోగకరంగా ఉండటంతో పాటు వారికి ఆర్థిక భద్రత, భరోసా కలుగుతుందని తెలిపారు. దీనిపై స్పందించిన ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ అజ్మీర వీరన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అలాగే రిటైర్మెంట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు బ్యాంకులో ఖాతాలు ప్రారంభించాలని సూచించారు. బ్యాంకులో వివిధ రకాల రుణాలు, బీమా పథకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అదేవిధంగా 60 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన పెన్షనర్లకు ఎలాంటి ప్రీమియం చెల్లించకుండా ఒక ఫోటో, ఆధార్ కార్డు సమర్పిస్తే రూ.30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాషియర్ ఐల రాజేశం, అధ్యక్షుడు బూడిది గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు గుర్రపు గంగయ్య, ప్రధాన కార్యదర్శి పోటు బాబు, కోశాధికారి కే. యాదగిరి, సహాయ కార్యదర్శి ఎండి నియాజ్, మాటూరి నారాయణ, పత్యం రంగయ్య, ఎంపీ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారుల దుకాణాలను కూల్చివేత దారుణం

## బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపల్లి విజిత్ కుమార్

**మంచిర్యాల, జూన్ 23 (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బస్టాండ్, మార్కెట్ ప్రాంతాల్లో చిరు వ్యాపారుల షెడ్లను తొలగించడం దారుణమని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపల్లి విజిత్ కుమార్ ఆరోపించారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రోత్సాహంతో అధికారులు, పోలీసుల సహకారంతో ఈ కూల్చివేతలు చేపట్టారని ఆయన విమర్శించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మార్కెట్, బస్టాండ్ ప్రాంతాల్లో వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారుల షెడ్లను మంగళవారం తొలగించిన నేపథ్యంలో నడిపల్లి విజిత్ కుమార్ బాధితులను కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మంచిర్యాల నియోజకవర్గంలో దుర్మార్గమైన పాలన కొనసాగుతోందని విమర్శించారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కు ప్రజల సంక్షేమం కంటే పదవి, డబ్బు సంపాదనే ముఖ్యమైందని ఆరోపించారు. అభివృద్ధి, ప్రజాసేవలను పక్కనబెట్టి కూల్చివేతలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో వ్యాపారులకు ఇది అనుకూలమైన సమయమని, అలాంటి సమయంలో వారి షెడ్లను తొలగించడం బాధాకరమని తెలిపారు. వ్యాపారులు వ్యాపారంపై ఆశతో ఒక్కొక్కరు సుమారు రూ.2 లక్షల విలువైన సామాగ్రిని కొనుగోలు చేసినట్లు తమకు తెలిపారని అన్నారు. గతంలో రైల్వే స్టేషన్ సమీపంలోని 170 షాపులను తొలగించే పరిస్థితి వచ్చినప్పుడు అప్పటి ఎమ్మెల్యే దివాకర్ రావు అధికారులతో మాట్లాడి వాటిని కాపాడిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలు నమ్మకంతో ఓటు వేస్తే, ప్రస్తుతం అదే వారి



పాలిట శాపంగా మారిందని వ్యాఖ్యానించారు. దొంగతనాలు, దోపిడీలు జరిగినప్పుడు ఆలస్యంగా స్పందించే పోలీసులు, కూల్చివేతల సమయంలో మాత్రం ముందే అక్కడికి చేరుకోవడం విచారకరమని అన్నారు. బాధితులకు తగిన నష్టపరిహారం అందించడంతో పాటు ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపించాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌ను డిమాండ్ చేశారు. అలాగే నష్టపోయిన వ్యాపారులకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ప్రస్తుతం ప్రజాప్రతినిధులు, అధికారులు న్యాయం చేయకపోయినా భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు న్యాయం జరగకపోతే బిఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, టిబిజికేఎస్ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతనంగా బాధ్యతలు చేపట్టిన మంచిర్యాల జిల్లా ట్రెజరీ అధికారికి సన్మానం



**మంచిర్యాల, జూన్ 23 (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా ట్రెజరీ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రమేష్‌ను టీఎన్జీవో ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, ఉద్యోగుల సంక్షేమం మరియు ప్రజా సేవల విషయంలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి బొడ్డు శ్రావణ్ కుమార్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షులు తిరుపతి రాంకుమార్, సంయుక్త కార్యదర్శి సునీత, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మోసిన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ ఏరియా లో పారదర్శకంగా మెడికల్ గ్రౌండ్స్ క్వార్టర్స్ కౌన్సిలింగ్ నిర్వహణ





**మంచిర్యాల, 23, జూన్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో వైద్యపరమైన (మెడికల్ గ్రౌండ్స్ ) సమస్యలతో బాధపడుతున్న కార్మికులకు క్వార్టర్ల కేటాయింపునకు సంబంధించి మంగళవారం ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌లో సుమారు 27 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఆర్కే-8 డిస్పెన్సరీ డీవై సీఎంఓ రమేష్ బాబు పర్యవేక్షణలో ఒక్కో ఉద్యోగి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, వారి అనారోగ్య తీవ్రత ఆధారంగా క్వార్టర్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. వైద్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రూపొందించిన ర్యాంకుల ఆధారంగా ఉద్యోగులకు అవకాశం కల్పించారు. ఇందులో ఐదుగురు ఉద్యోగులు గోదావరి కాలనీలో, ఇద్దరు ఉద్యోగులు కృష్ణ కాలనీలో క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం ఎన్. సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, డిప్యూటీ మేనేజర్ (ఎస్టేట్స్) మహేష్, సీనియర్ పీఓ ప్రశాంత్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, సెక్యూరిటీ విభాగం నుంచి ధాతు సతీష్ పాల్గొన్నారు.

# మంచిర్యాల బస్టాండ్ మార్కెట్ ఏరియాలో షెడ్ల తొలగింపు కలకలం

**జీవనోపాధి కోల్పోయిన చిరు వ్యాపారుల ఆవేదన అభివృద్ధి ఒకవైపు, ఉపాధి మరోవైపు**

**షెడ్లు కూలాయి... జీవితాలు కూలిపోతున్నాయా..? బాధ్యత ఎవరిది..?**

**మంచిర్యాలలో వందలాది చిరు వ్యాపారుల ఆవేదన**





**మంచిర్యాల, 23, జూన్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీప ప్రాంతం, మార్కెట్ రోడ్ మంగళవారం ఉదయం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు వేదికగా మారింది. దశాబ్దాలుగా జీవనోపాధిగా కొనసాగిస్తున్న చిరు వ్యాపారుల షెడ్లను మున్సిపల్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన తొలగించడం జిల్లాలో సంచలనంగా మారింది. తెల్లవారుజామున ప్రారంభమైన ఈ కార్యక్రమం భారీ పోలీసు బందోబస్తుతో కొనసాగింది. అధికారులు బుల్డోజర్లతో అక్రమ నిర్మాణాల పేరుతో షెడ్లను నేలమట్టం చేస్తుండగా, తమ కళ్లముందే జీవనాధారం కూలిపోతుండటంతో పలువురు వ్యాపారులు బోరున విలపించిన దృశ్యాలు అక్కడ కనిపించాయి. మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ ఆధ్వర్యంలో భారీగా పోలీసు బలగాలను మోహరించి తొలగింపు కార్యక్రమాన్ని కొనసాగించారు. ఉదయం 6 గంటల నుంచే అధికారులు చర్యలు ప్రారంభించగా, కొందరు వ్యాపారులు తమ సామగ్రిని సర్దుకునే అవకాశం కూడా లేకుండానే షెడ్లను కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో మంచిర్యాలలో రాత్రి నుంచి ఉదయం వరకు కురిసిన భారీ వర్షంతో ప్రాంతమంతా బురదమయంగా మారింది. ఆ బురదలోనే వ్యాపారులు తమ సామగ్రిని కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆటబొమ్మలు, చిన్నపిల్లల రెడీమేడ్ దుస్తులు, బూట్లు, బెల్టులు, గృహోపకరణాలు, ఇతర చిన్న వ్యాపార వస్తువులు బురదలో పడి చెల్లాచెదురుగా కనిపించాయి. కొన్ని చోట్ల రేకులు, సామగ్రి, వ్యాపార వస్తువులను అధికారులు కుప్పలుగా వేసిన దృశ్యాలు కనిపించాయి.తా ము గత 20--25 ఏళ్లుగా ఇక్కడే వ్యాపారాలు చేసుకుంటూ మా కుటుంబాలను పోషిస్తున్నాం. కనీసం మా సామాను తీసుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. ఇప్పుడు మా కుటుంబాలు రోడ్డున పడ్డాయి" అంటూ పలువురు వ్యాపారులు కన్నీటి పర్యంతమయ్యారు. మరో వ్యాపారి మాట్లాడుతూ, "రోజు వచ్చిన ఆదాయంతోనే మా పిల్లలకు అన్నం పెడుతున్నాం. ఇప్పుడు మా షెడ్లు లేకపోతే బతుకుదెరువు ఎలా సాగుతుంది?" అంటూ బోరున విలపించింది. మరో వ్యాపారి మాట్లాడుతూ, "మాకు ఈ స్థలంలో వ్యాపారాలు నిర్వహించేందుకు అనుమతి ఉందని చెప్పారు. మేము అద్దెలు కూడా చెల్లించాం. ఇప్పుడు లక్షల రూపాయల విలువ చేసే సామాను నష్టపోయింది. మాకు ప్రత్యామ్నాయ స్థలం చూపించి ప్రభుత్వం ఆదుకోవాలి" అని వేడుకున్నారు. అయితే వ్యాపారుల ఆరోపణలపై మున్సిపల్ కమిషనర్ జి. అన్వేష్ స్పందిస్తూ, ఆక్రమణల తొలగింపుపై ముందుగానే పలుమార్లు హెచ్చరికలు జారీ చేశామని, నోటీసులు కూడా ఇచ్చామని స్పష్టం చేశారు. పట్టణ సుందరీకరణ, రహదారుల విస్తరణ, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా చేయడమే ఈ చర్యల ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఈ వ్యవహారంలో మరో కోణం కూడా వెలుగులోకి వస్తున్నట్లు తెలుస్తోంది. ఫుట్‌పాత్‌లు, ప్రభుత్వ స్థలాలపై ఏర్పాటు చేసిన షెడ్ల వెనుక కొందరు స్థానిక నాయకుల ప్రమేయం ఉందని బాధితులు ఆరోపిస్తున్నారు. గతంలో కొందరు కౌన్సిలర్లు, ప్రస్తుతం కొందరు ప్రజాప్రతినిధుల అండదండలతో షెడ్లను ఏర్పాటు చేసి వాటిని అద్దెలకు ఇచ్చి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. మంచిర్యాలలో ఆక్రమణల తొలగింపు కొత్త విషయం కాదు. గతంలో రైల్వే స్టేషన్ పరిసరాలు, కూరగాయల మార్కెట్ ప్రాంతం, బాలికల హైస్కూల్ ప్రాంతం, మార్కెట్ ఏరియాలో కూడా వందలాది షెడ్లను తొలగించిన సందర్భాలు ఉన్నాయి. అయినప్పటికీ కొందరి ప్రోత్సాహంతో మళ్లీ ఆక్రమణలు కొనసాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకుడు నడిపల్లి విజిత్ కుమార్ ఇతర నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘటనాస్థలాన్ని సందర్శించి బాధితులకు భరోసా ఇచ్చారు. బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు . ఇదే సమయంలో ఈ అంశంలో అందరి దృష్టి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుపై పడింది. ప్రజా సమస్యలపై స్పందించే నాయకుడిగా గుర్తింపు పొందిన ఎమ్మెల్యే ఈ అంశంపై మానవీయ కోణంలో స్పందించాలని పలువురు కోరుతున్నారు. పట్టణ అభివృద్ధి, రహదారుల విస్తరణ అవసరమే అయినప్పటికీ, దశాబ్దాలుగా చిరు వ్యాపారాలపై ఆధారపడి జీవిస్తున్న వందలాది కుటుంబాల జీవనాధారాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. బాధితులకు ప్రత్యామ్నాయంగా వ్యాపార స్థలాల కేటాయింపు, ప్రభుత్వ పథకాల ద్వారా సహాయం లేదా స్వచ్ఛంద సంస్థల సహకారంతో పునరావాస చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. అయితే ఇలాంటి సందర్భాల్లో అసలు బాధ్యత ఎవరిది అన్న ప్రశ్న ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. దశాబ్దాలుగా జీవనోపాధిగా వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారులదా...? లేక ఆక్రమణలను ప్రోత్సహిస్తూ, అద్దెల పేరుతో లాభాలు పొందుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంతమంది ప్రజా నాయకులదా...? లేక ప్రారంభ దశలోనే అక్రమాలను అరికట్టాల్సిన వ్యవస్థలదా...? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. చివరికి అన్ని కోణాల్లో చూసినా నష్టపోయింది మాత్రం రోజువారీ ఆదాయంపై ఆధారపడి జీవించే చిరు వ్యాపారులేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు పట్టణ అభివృద్ధి అవసరం, మరోవైపు పేద కుటుంబాల బతుకుదెరువు కూడా అవసరమే. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధిస్తూ ప్రత్యామ్నాయ వ్యాపార స్థలాలు, పునరావాసం లేదా ఆర్థిక సహాయం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు సూచిస్తున్నాయి. మానవీయ కోణంలో మనసున్న ప్రతి ఒక్కరూ ఈ అంశంపై ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఆసిఫాబాద్ జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ముండే దీపక్



**ఆసిఫాబాద్, జూన్ 23 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా వాంకిడి మండలానికి చెందిన ఉప సర్పంచ్ ముండే దీపక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యదర్శి మెరుగు జంపన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గానవేణి మల్లేశ్, నందిని ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఉప సర్పంచ్‌లందరూ ముండే దీపక్‌ను ఏకగ్రీవం గా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.అనంతరం నూతన అధ్యక్షుడికి నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముండే దీపక్ మాట్లాడుతూ ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉప సర్పంచ్‌లను సంఘటితం చేసి వారి సంక్షేమం కోసం పనిచేస్తానని తెలిపారు. సమావేశంలో పలువురు ఉప సర్పంచ్‌లు, ఫోరం నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

**కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా**

**కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్**




**ఆసిఫాబాద్, జూన్ 23 ప్రజా జ్యోతి** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కొమురం భీం చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు మున్సిపల్ కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. 2వ పీఆర్‌సీలో కనీస వేతనాన్ని రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులందరికీ డీఏ వర్తింపజేయాలని కోరారు. కార్మికుల వేతనాల నుంచి మినహాయించిన పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను వెంటనే జమ చేయాలని, ప్రభుత్వాసుపత్రుల్లో ఈఎస్ఐ వైద్య సేవలను మెరుగుపరచాలని అన్నారు.మరణించిన కార్మికుల దహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలని, ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు కాని కార్మికుల పేర్లను వెంటనే నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్, హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని, పని ప్రదేశాల్లో రక్షణ సామగ్రి, రెస్ట్ రూములు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వెలిశాల కృష్ణమాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు పెరక శ్రీకాంత్, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్ల రాజు, ఇరికిరాల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంజీవ్, ఉపాధ్యక్షుడు తోట సమ్మయ్య, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## కమిషనరేట్ ఆర్మ్డ్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించిన సీపీ అంబర్ కిషోర్ ఝా



**మంచిర్యాల, 23, జూన్ (ప్రజాజ్యోతి):**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కమిషనరేట్ ఆర్మ్డ్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హెడ్‌క్వార్టర్స్, ఆర్ఐ కార్యాలయం, డాగ్ స్క్వాడ్ గదులను తనిఖీ చేసి సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. సిబ్బంది వివరాలు, విధుల నిర్వహణ, స్పెషల్ పార్టీ సిబ్బంది బాధ్యతలు, అలాగే ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణ, సమన్వయం, సమర్థతను పెంపొందించే అంశాలపై సూచనలు చేశారు. హెడ్‌క్వార్టర్స్‌లోని ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. సిబ్బంది విధుల నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా, సక్రమంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

## కార్మికులకు ఇన్సూరెన్స్ కల్పించాలి



**రామకృష్ణాపూర్,జూన్ 23 (ప్రజా జ్యోతి):** క్యాతనపల్లి మున్సిపాలిటీ కమిషనర్‌కు సీఐటీయు ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు సబ్బులు, నూనె, చెప్పులు, బెల్లం అందించాలని కోరారు. కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సాంబారి వెంకటస్వామి, మహేందర్, దేవవరం తదితరులు పాల్గొన్నారు.

## చీలాటిగూడలో బోరుబావి పనులకు శ్రీకారం



**ఆసిఫాబాద్ జూన్ 23 ప్రజా జ్యోతి ఆసిఫాబాద్** మండలంలోని చీలాటి గూడ గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరుబావి పనులను సోమవారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు ఆధ్వర్యంలో పనులకు శ్రీకారం చుట్టారు. సర్పంచ్ ఏకొన్‌కార్ వినోద్, ఉప సర్పంచ్ రవీందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు దరుంబాయి గ్రామస్తులతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆత్రం సక్కు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య నివారణకు బోరుబావి ఉపయోగ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

# చెన్నూర్ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు

### రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి





**మంచిర్యాల, 23, జూన్ (ప్రజాజ్యోతి):**జిల్లాలోని చెన్నూర్ నియోజక వర్గంలో అన్ని రంగాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. జిల్లాలోని కోటపల్లి మండలం లింగన్నపేట, ఏదుల బంధం, సిర్స, రొయ్యలపల్లి, ఆల్గాం, వెంచపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, మండల తహసీల్దార్ రాఘవేంద్ర, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, డీసీసీ ప్రతినిధి రఘునాథ్ రెడ్డితో కలిసి మంత్రి మంగళవారం భూమిపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం ప్రతి గ్రామానికి రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించి పనులు ప్రారంభించామని తెలిపారు. లింగన్నపేట గ్రామంలో గతంలో ఈజీఎస్, ఎస్డీఎఫ్ నిధులతో రూ.20 లక్షల వ్యయంతో 14 విద్యుత్ స్తంభాలు, నాలుగు బోర్వెల్స్ ఏర్పాటు చేశామని, ప్రస్తుతం మరో రూ.10 లక్షలు కేటాయించామన్నారు . ఏదుల బంధం గ్రామంలో రూ.15 లక్షల ఎస్‌డీఎఫ్, డీఎంఎఫ్‌టీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని, ఆల్గాం, వెంచపల్లి, జనగాం గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గంలో రెండు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రూ.200 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, మురుగునీటి వ్యవస్థ పనులు, రూ.100 కోట్ల వ్యయంతో అమృత్ 2.0 పథకం ద్వారా నీటి ట్యాంకులు, పైపులైన్ల ఏర్పాటు పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. ఉపాధి



అవకాశాల కోసం రూ.46 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, వృత్తి విద్యతో పాటు విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. చెన్నూర్‌లో నీటి సమస్య పరిష్కారానికి రూ.40 కోట్లతో ప్రత్యామ్నాయ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు . వైద్య రంగ బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, చెన్నూర్‌లో 23 మంది వైద్యులతో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మందమర్రి ప్రాంతంలో 50 పడకల ఆసుపత్రి పునఃప్రారంభంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సింగరేణి సంస్థను లాభాల బాటలో నడిపిస్తూ రూ.11 వేల కోట్ల లాభాలను సాధించామని తెలిపారు. ఇసుక మాఫియాపై కట్టుదిట్టమైన చర్యలు చేపడుతూ సీసీ కెమెరాలు, వే బ్రిడ్జిల ద్వారా పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని అన్నారు . ఆల్గాం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన మంత్రి విద్యార్థులకు అవసరమైన మూత్రశాలలు, విద్యుత్, ఇతర మౌలిక వసతులపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “సే నో టు డ్రగ్స్” కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని, విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆలుగామ వరిధాన్య కొనుగోలు కేంద్రంపై విచారణ..

**అక్రమాల ఆరోపణలు అవాస్తవము - జిల్లా సహకార అధికారి**

**మంచిర్యాల, 23, జూన్ (ప్రజాజ్యోతి):**మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం ఆలుగాం వరి ధాన్య కొనుగోలు కేంద్రంలో జరిగినట్లు ఆరోపణలు వచ్చిన అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టారు. ఆలుగాం గ్రామానికి చెందిన బింక లక్ష్మి సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన వీడియో వైరల్ కావడంతో ఈ అంశంపై సహకార శాఖ అధికారులు స్పందించారు. రైతులకు అన్యాయం జరుగుతోందని వీడియోలో పేర్కొనడంతో దీనిపై విచారణ నిర్వహించారు.ఈ సందర్భంగా సహకార అధికారి కె. రవీందర్ రావు కోటపల్లి సొసైటీని సందర్శించారు. కేంద్ర ఇన్‌చార్జి రమేష్ గౌడ్, ఫిర్యాదుదారు బింక లక్ష్మి మరియు రైతులను పిలిపించి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విచారణలో భాగంగా కేంద్రంలో క్వింటాల్‌కు 10 కిలోల వరకు కోత విధిస్తున్నారన్న ఆరోపణలపై బింక లక్ష్మిని ప్రశ్నించగా, అటువంటి కోతలు ఎక్కడా విధించలేదని ఆమె తెలిపినట్లు అధికారులు అన్నారు. అలాగే ఆమెకు ధాన్యం విక్రయానికి సంబంధించిన చెల్లింపులు జాప్యం కావడానికి కారణాలు పరిశీలించగా, ఆమె తన పంటను భర్త పేరుతో ట్రక్ షీట్ ద్వారా రైస్ మిల్లుకు పంపినట్లు గుర్తించారు. అయితే సంబంధిత వివరాలు డేటాలో నమోదు కాకపోవడంతో సాంకేతిక సమస్య తలెత్తినట్లు అధికారులు వెల్లడించారు. టెక్నికల్ సమస్య కారణంగా వివరాలు సరిగా నమోదు కాకపోవడంతో చెల్లింపుల్లో ఆలస్యం జరిగిందని గుర్తించిన అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించి, ట్యాబ్‌లో వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు. రైతుకు సకాలంలో డబ్బులు అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు . కొనుగోలు కేంద్రంలో మోసం జరిగిందనే ఆరోపణలు విచారణలో నిజం కాదని తేలినట్లు మంచిర్యాల జిల్లా సహకార అధికారి స్పష్టం చశారు .

## ఉప సర్పంచ్‌ల ఫోరం కమిటీ ఎన్నిక



ఆసిఫాబాద్ జూన్ 23 ప్రజా జ్యోతి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల ఉప సర్పంచ్‌ల ఫోరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ముండే దీపక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా సాగర్, ప్రధాన కార్యదర్శిగా జాడే సంతోష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ముండే దీపక్ మాట్లాడుతూ ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, గౌరవ వేతనం కోసం నూతన కమిటీ కృషి చేయాలని సూచించారు. ఉప సర్పంచ్‌లు ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ సభ్యులను ఉప సర్పంచ్‌లు, సర్పంచ్‌లు అభినందించారు. కార్యక్రమంలో మండలంలోని ఉప సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## టీచర్‌గా పనిచేసిన రోజులు మరవలేను: ఆత్రం సుగుణక్క

**రాశిమెట్ట ఆశ్రమ పాఠశాలలో బడిబాట కార్యక్రమం**

**విద్యార్థినులకు పుస్తకాలు అందజేసిన డీసీసీ అధ్యక్షురాలు**



ఆసిఫాబాద్ జూన్ 23 ప్రజా జ్యోతి ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క సోమవారం జైనూర్ మండలం రాశిమెట్ట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేసి విద్య ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ.. తాను ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేసిన రోజులను గుర్తుచేసుకున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించి విద్యార్థులను బడికి రప్పించడం, తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతను తెలియజేయడం వంటి అనుభవాలను పంచుకున్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువులో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో విద్యారంగం కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజాసేవ కోసమే ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చానని, గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేశానని అన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా భాయ్, డీసీసీ ఉపాధ్యక్షుడు తారీక్, జనరల్ సెక్రటరీ గాదవేణి మల్లేష్, మైనార్టీ నాయకుడు సఫన్, రాశిమెట్ట సర్పంచ్ ఉయిక చందు, భూసిమెట్ట సర్పంచ్ దుర్వ సింధు నాగేష్, చింతకర్ర సర్పంచ్ విఠల్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్న మల్లేష్, ముఖిద్, తారీఫ్, ప్రకాష్, సార్ మేడి కుంరం దుండే రావ్, నాయకులు జామిల్, సుదర్శన్, అజ్జు లలా, జంగు, రహీమ్, కోటేశ్వర్, గ్రామ పటేల్ ఉయిక ఆనంద్ రావ్, హెడ్ మాస్టర్ పవర్ అనిత, ఉపాధ్యాయులు గణపత్, సుందర్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగులకు బీమా ధీమా... రూ.1 కోటి నుంచి రూ.1.50 కోట్ల వరకు బీమా రక్షణ

## సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ప్రత్యేక ఒప్పందం



మంచిర్యాల, 23, జూన్ (ప్రజాజ్యోతి):సింగరేణి సంస్థ కార్మిక సంక్షేమానికి మరో ముందడుగు వేస్తూ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో శాలరీ ఖాతాలు కలిగి ఉన్న సింగరేణి ఉద్యోగులకు భారీ బీమా రక్షణతో పాటు పలు ప్రత్యేక బ్యాంకింగ్ రాయితీలు అందుబాటులోకి రానున్నాయి. ఈ పథకం కింద ప్రమాద మరణం లేదా శాశ్వత వైకల్యం సంభవించిన సందర్భంలో రూ.1 కోటి నుంచి రూ.1.50 కోట్ల వరకు బీమా రక్షణ కల్పించనున్నారు. అలాగే సహజ మరణం సంభవించిన సందర్భంలో రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బీమా సదుపాయం అందించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు మార్గదర్శకత్వంలో, సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, ఐఏఎస్, డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, ఐఏఎస్ ప్రత్యేక చొరవతో ఈ ఒప్పందం అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. కొత్తగూడెం హెడ్ ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సీఎస్ఆర్ జి.వి. కిరణ్ కుమార్ మరియు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోన్ డిప్యూటీ జోనల్ హెడ్ ఎ.వి. రమణమూర్తి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో జీఎం (పర్సనల్) ఐఆర్ అండ్ పీఎం కవిత నాయుడు, జీఎం (పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సీ ఏజీఎం మురళీధర్ రావు, జీఎం (ఎఫ్ అండ్ ఎ) ఎన్. చక్రవర్తి, డీజీఎంలు (పర్సనల్) కేసా నారాయణరావు, ముకుంద సత్యనారాయణ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరంగల్ రీజియన్ హెడ్ ఐ. రాజ్‌కుమార్, చీఫ్ మేనేజర్లు అబ్దుల్ ఖాదర్ షేక్, బి. నరేందర్ రెడ్డి, కొత్తగూడెం బ్రాంచ్ హెడ్ జి. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ ఒప్పందం ద్వారా సింగరేణి ఉద్యోగులకు ఆర్థిక భద్రత మరింత బలోపేతం కావడంతో పాటు, వారి కుటుంబాలకు కూడా భరోసా కలిగించేలా ప్రత్యేక బీమా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**--హెచ్ ఈ ఓ పవార్ రవీందర్**



నేరడిగొండ, జూన్ 23 (ప్రజా జ్యోతి):వర్షాకాలం నేపథ్యంలో ప్రజలంతా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పవార్ రవీందర్ సూచించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ఆధ్వర్యంలో 'డ్రై డే' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ ఈ ఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. అనంతరం మాదాపూర్ గ్రామంలో పెందూర్ విజయశ్రీ (భర్త జంగు) అనే బాలింతను సందర్శించి, పి.ఎన్.సి ని చెకప్ చేశారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు యు.వనిత (వాగ్ధారి), సావిత్రి (మాదాపూర్) తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికల్లో నేటి నుంచి విత్తన మేళా

**-- వ్యవసాయ అధికారి కృష్ణవేణి**




నేరడిగొండ జూన్ 23 (ప్రజా జ్యోతి):రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని రైతు వేదికల్లో ఈ నెల 23 నుంచి 30 వరకు వారం రోజుల పాటు 'విత్తన మేళా' నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచడంతో పాటు, పంటల సాగుపై పూర్తి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. అందుబాటులో ఉండే విత్తనాలు:ఈ మేళాలో ప్రభుత్వంచే ధృవీకరించబడిన వరి, పప్పుధాన్యాలు, నూనెగింజలు తదితర పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంటాయి. విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి విధానాలు, మరియు ఆధునిక సాగు పద్ధతులపై వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు క్షేత్రస్థాయిలో సలహాలు, సూచనలు అందిస్తారు. "రైతులు తమ అవసరాలకు అనుగుణంగా విత్తనాలను పొందేందుకు తమ సమీపంలోని రైతు వేదికలను సందర్శించాలి. మండలంలోని రైతాంగమంతా ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, మేళాలో పాల్గొని నాణ్యమైన విత్తనాలను పొందాలి.

## సర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి. తహసిల్దార్ బక్కయ్య



జన్నారం,జూన్23(ప్రజాజ్యోతి)కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జన్నారం మండల తహసిల్దార్ బక్కయ్య సూచించారు. ఈనెల 25 నుండి ప్రారంభం సర్ ప్రక్రియ ప్రారంభం కానున్నందున మంగళవారం జన్నారం మండలంలోని అన్ని బూతు లెవల్ అధికారులకు సర్ ప్రక్రియకు సంబంధించిన కిట్లను మరియు ఎన్యుమరేషన్ ఫామ్ లను తహశీల్దార్ బక్కయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే కోసం సంబంధిత అధికారులు ఇంటింటికి వచ్చినప్పుడు వారికి సహకరించి అవసరమైన వివరాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ వెంకటేశం,తదితరులు పాల్గొన్నారు

## అనుమానం పెనుభూతమై...భర్త

**వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య.**





**జన్నారం,జూన్23(ప్రజాజ్యోతి)** అనుమానం ఆ దంపతుల పాలిట పెనుభూతమైంది. భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్.ఐ ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం అదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ గ్రామానికి చెందిన ఖర్ద్ మాధవరావు కుమార్తె జ్యోత్స్న(27) కు జన్నారం మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన కస్తులాపురి మల్లన్న కుమారుడు కస్తూలాపురి నాగరాజుతో ఐదు సంవత్సరాల క్రితం వివాహం జరుగగా వారికి నాలుగు సంవత్సరాల బాబు ఉన్నాడు. భర్త నాగరాజు బ్రతుకు దెరువు కోసం దుబాయ్ వెళ్ళగా, భార్య జ్యోత్స్న జన్నారం మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో టీచర్ గా పని చేస్తుంది. దుబాయ్ నుంచి వచ్చిన భర్త నాగరాజు భార్య జ్యోత్స్న పై అనుమానం పెంచుకొని వేరే వారితో అక్రమ సంబంధం ఉందని, శారీరకంగా ,మానసికంగా వేధించాడని బాధపడుతూ ఈనెల 21వ తేదీన గుర్తు తెలియని మందు గోళీలు మింగగా, చికిత్స నిమిత్తం లక్ష్య ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి అక్కడి నుండి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లామని భర్త అన్న కస్తులాపురి నరేష్ జ్యోత్స్న తండ్రి మాధవరావు కి ఫోన్ చేసి చెప్పగా, కుటుంబ సభ్యులతో మాధవరావు మంచిర్యాల ఆసుపత్రికి వెళ్లి చూడగా చికిత్స పొందుతూ అపస్మారక స్థితిలో ఉంది. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం జ్యోత్స్న చనిపోయిందని, కస్తులాపురి నాగరాజు కు అన్న నరేష్ ,అమ్మ లక్ష్మి లు నా బిడ్డ జ్యోత్స్న పై లేనిపోనివి చెప్పి అనుమానం రేకెత్తించినందువలన అల్లుడు నాగరాజు పెట్టే బాధలు భరించలేక జ్యోత్స్న ఆత్మహత్య చేసుకుందని తండ్రి మాధవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు.

# టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు నల్లాల ఓదెలు ఘన సన్మానం



**మంచిర్యాల ప్రతినిధి జూన్ 23 ప్రజా జ్యోతి:**తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని మాజీ ప్రభుత్వ విప్, మాజీ చెన్నూరు శాసనసభ్యులు నల్లాల ఓదెలు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నల్లాల ఓదెలు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందని, ఆ విశ్వాసాన్ని మరింత పెంపొందించే బాధ్యత పార్టీ నాయకత్వంపై ఉందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శిస్తూ పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యకర్తలే కాంగ్రెస్‌కు వెన్నెముకలని పేర్కొన్న ఆయన, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు మరింత ప్రాధాన్యత కల్పిస్తూ పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా పార్టీ నాయకత్వం నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆశయాల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, రాష్ట్రవ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు. అనంతరం నల్లాల ఓదెలు, నల్లాల క్రాంతి, ప్రశాంత్‌లు మహేష్ కుమార్ గౌడ్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన ఈ సమావేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నల్లాల క్రాంతి, పీసీసీ కోఆర్డినేటర్ ప్రశాంత్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రాజ్యాధికార సమరభేరిని విజయవంతం చేద్దాం

**జిల్లా నాయకుల పిలుపు**

**బహుజనుల ఐక్యతతో జులై 5న చరిత్ర సృష్టిస్తాం మహేష్ వర్మ**



**మంచిర్యాల, 23, జూన్ (ప్రజా జ్యోతి):**భువనగిరిలో జులై 5న నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" సభను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పలు బీసీ సంఘాలు, బీసీ కుల సంఘాల నాయకులను కలిసి ఆహ్వాన పత్రాలను అందజేసి సభకు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు మహేష్ వర్మ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో బీసీల రాజ్యాధికారం సాధ్యమవుతుందని, తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో తీన్మార్ మల్లన్న నాయకత్వంలోనే ఆ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి వారి వాటా వారికి దక్కే విధంగా వ్యవస్థను నిర్మించడమే పార్టీ లక్ష్యమని తెలిపారు. సామాజిక తెలంగాణ నిర్మాణమే తీన్మార్ మల్లన్న లక్ష్యమని అన్నారు. జులై 5న నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" సభ రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి బహుజనుల గర్జన వినిపించేలా భారీ స్థాయిలో సభ నిర్వహించనున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న బహుజనులు పార్టీలకు, సంఘాలకు అతీతంగా సభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ మహమ్మద్ లతీఫ్, జిల్లా నాయకులు పడాల శివతేజ, బూర రవీందర్, బొంగొని విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పై బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ)కు అవగాహన సదస్సు

### పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్



**మంచిర్యాల, 23,జూన్ ( ప్రజా జ్యోతి):** మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ఎస్. కన్వెన్షన్ (బైపాస్ రోడ్డు) ఫంక్షన్ హాల్‌లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ) కోసం ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ హాజరై, ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై పార్టీ నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లకు వివరణ ఇచ్చారు. ఓటర్ల వివరాల నమోదు, మార్పులు, సవరణలు మరియు ఎన్నికల ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్రపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, పార్టీ కార్యకర్తలు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చెన్నూర్ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు

రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద




**మంచిర్యాల ప్రతినిధి జూన్ 23 ప్రజా జ్యోతి:**జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో అన్ని రంగాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం జిల్లాలోని కోటపల్లి మండలం లింగన్నపేట, ఏదుల బంధం, సిర్స, రొయ్యలపల్లి, ఆల్గాం, వెంచపల్లి గ్రామాలలో సి.సి. రోడ్లు, డ్రైనేజీల పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఎ.సి.పి. వెంకటేశ్వర్లు, మండల తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి, డి.సి.సి. ప్రతినిధి రఘునాథ్ రెడ్డి లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలలో సి.సి. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రతి గ్రామానికి 10 లక్షల చొప్పున కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. లింగన్నపేట గ్రామంలో గతంలో 14 నూతన విద్యుత్ పోల్స్, 4 బోర్ వెల్స్ పనులను దాదాపు 20 లక్షల రూపాయల ఈజీఎస్, ఎస్.డి.ఎఫ్. నిధులతో చేపట్టి ఇప్పుడు 10 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఏదుల బంధంలో 15 లక్షల రూపాయల ఎస్.డి.ఎఫ్., డి.ఎం.ఎఫ్.టి. నిధులతో పనులు చేపట్టడం జరిగిందని,ఆల్గాం, వెంచపల్లి, జనగాం గ్రామాలలో 10 లక్షల రూపాయల చొప్పున కేటాయించి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రేషన్ కార్డులు అందించి సన్నబియ్యం అందించడం జరుగుతుందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి అనేక పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో 2 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయడం జరుగుతుందని, 200 కోట్ల రూపాయల వ్యయంతో సి.సి. రోడ్లు, మురుగునీటి వ్యవస్థ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 100 కోట్ల రూపాయల వ్యయంతో అమృత్ 2.0 పథకం ద్వారా ప్రజలకు త్రాగునీరు అందించేందుకు నీటి ట్యాంకులు, పైపులైన్ల ఏర్పాటు పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. 46 కోట్ల రూపాయల వ్యయంతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, వృత్తి విద్య కోర్సులు అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయడంతో పాటు విదేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెన్నూర్ లో నీటి వనరుల ఏర్పాటుకు 40 కోట్ల రూపాయలతో ప్రత్యామ్నాయ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైద్య రంగ బలోపేతం దిశగా కృషి చేస్తూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, 23 మంది వైద్యులను నియమించి చెన్నూర్ లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని, మందమర్రి ప్రాంతంలో 50 పడకల ఆసుపత్రి పున: ప్రారంభానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. సింగరేణి సంస్థను లాభాల బాటలోకి తీసుకువచ్చి 11 వేల కోట్ల రూపాయల లాభాన్ని సాధించడం జరిగిందని తెలిపారు. ఇసుక మాఫియా నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని, సి.సి. కెమెరాలు, వే బ్రిడ్జిల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఆల్గాం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, మూత్రశాలలు, విద్యుత్, ఇతర మరమ్మత్తు పనులపై అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో "సే నోటు డ్రగ్స్" కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి విక్రయాలపై పోలీసు శాఖ అధికారులు సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు దవాఖానలో సౌకర్యాల కొరత

కరెంట్ పోతే అంధకారం.. లిఫ్ట్ మొరాయిస్తే నరకం
సూపరింటెండెంట్‌కు వినతి.. నిధుల్లేవంటున్న అధికారులు



**ఆసిఫాబాద్ జూన్ 23 ప్రజా జ్యోతి** జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తాగునీరు, విద్యుత్, లిఫ్ట్ సమస్యలతో పాటు వైద్యులు, నర్సుల కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డీవైఎఫ్ఐ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) నేతలు పేర్కొన్నారు. సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రేడియాలజిస్ట్, స్కానింగ్ డాక్టర్లు లేకపోవడంతో గర్భిణీలు, ఇతర రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లిఫ్ట్ పనిచేయకపోవడం, రాత్రి సమయంలో రెండు మూడు గంటలు కరెంటు పోతే జనరేటర్ కూడా పనిచేయక పోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. వెంటనే డాక్టర్లను నియమించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.దీనిపై సూపరింటెండెంట్ ప్రవీణ్ స్పందిస్తూ.. ఆసుపత్రి నుంచి సుమారు 50 మంది వైద్యులు, నర్సులు డిప్యుటేషన్‌పై ఇతర జిల్లాలు, మండలాలకు వెళ్లారని తెలిపారు. జనరేటర్‌కు నిధులు లేక ఇబ్బంది పడుతున్నామని, జిల్లా కలెక్టర్, డీఎంఈకి పలుమార్లు నిధులు, సిబ్బంది కోసం విన్నవించామని చెప్పారు. వారు స్పందిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, నిధుల లేమితోనే పనులు కావడం లేదని వివరించారు.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బిల్లులో ఒక రేటు.. వసూలు చేసేది మరో రేటు

జిల్లా కేంద్రంలో ఎరువుల వ్యాపారుల దోపిడీ
చర్యలు తీసుకోవాలని సీపీఎం నేత దుర్గం దినకర్ డిమాండ్




**ఆసిఫాబాద్ జూన్ 23 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ఎరువుల దుకాణంలో రైతుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. సోమవారం ఎరువులు కొనేందుకు వచ్చిన రైతుకు బిల్లు రసీదుపై ఒక రేటు రాసి, వాస్తవంగా మరో రేటు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.సాక్షాత్తు జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మారుమూల మండలాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని రైతులు వాపోతున్నారు. అధికారులు నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారే తప్ప జిల్లాలో ఏ ఒక్క ఎరువుల దుకాణదారుడిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని విమర్శలు వస్తున్నాయి.ఈ విషయమై సీపీఎం పార్టీ జిల్లా కార్య దర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యవ సాయ అధికారి వెంటనే ఆకస్మిక తనిఖీలు చేసి అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. రైతులను దోచుకుంటున్న వ్యాపారుల పై ఉపేక్ష వహిస్తే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు

## ఫారెస్ట్ ఆఫీస్ ముందు పోడు రైతుల ధర్నా

ఎమ్మెల్యే కోవ లక్ష్మి సంఘీభావం
'మా భూములు మాకే కావాలి' అంటూ నినాదాలు



**ఆసిఫాబాద్ జూన్ 23 ప్రజా జ్యోతి** పోడు భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆసిఫాబాద్ జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఎదుట పోడు రైతులు ధర్నా చేపట్టారు.ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధర్నా వద్దకు చేరుకొని రైతులకు సంఘీభావం ప్రకటించారు. రైతులతో కలిసి "మా భూములు మాకే కావాలి, మేము చనిపోయినా మా భూమిలోనే చస్తాం, మేము రైతులం, దేశానికే అన్నం పెట్టే రైతులం, మా భూములను లాక్కోవడం కంటే మమ్మల్ని ఇక్కడే చెట్లకి ఉరి తీయండి" అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు పోడు భూముల సమస్యను గుర్తించి లక్షలాది ఎకరాలకు పట్టాలు ఇచ్చారు. రైతుబంధు, రైతుబీమాతో కేసీఆర్ రైతులను కడుపులో పెట్టుకొని చూసుకున్నారు" అని అన్నారు. తరతరాలుగా పోడు చేసుకుంటున్న గిరిజన, ఆదివాసీ రైతులకు అన్యాయం జరగనివ్వబోమన్నారు. సర్వే పేరుతో విత్తనాల సీజన్‌లో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అటవీ అధికారులను హెచ్చరించారు. రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, వందలాది మంది పోడు రైతులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



**దండేపల్లి, జూన్ 23(ప్రజాజ్యోతి ):** ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దండేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు వేముల లక్ష్మణ్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ మంగళవారం పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మణ్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనకు వైద్యం అందిస్తున్న వైద్యులతో విజిత్ కుమార్ మాట్లాడారు. లక్ష్మణ్‌కు అందుతున్న వైద్య సేవలను, ఆయన కోలుకుంటున్న తీరును డాక్టర్లను అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన విజిత్ కుమార్, వారికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 38 ఏళ్ల సేవలకు ఘన సన్మానం




**జైపూర్ జూన్ 23 ప్రజా జ్యోతి** సింగరేణిలో 38 సంవత్సరాల పాటు వివిధ ఏరియాల్లో, వివిధ హోదాల్లో సేవలందించి ఈ నెల 30న పదవీ విరమణ పొందనున్న జనరల్ మేనేజర్ (అండర్ గ్రౌండ్ మైన్స్) వై. రఘురామిరెడ్డిని జైపూర్ ఎస్టిపిపి అధికారులు ఘనంగా సన్మానించారు. మంగళవారం ఎస్టిపిపి పరిపాలనా భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సేవలను కొనియాడుతూ శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టిపిపి ఈడీ సీహెచ్. చిరంజీవి మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధికి రఘురామిరెడ్డి అందించిన సేవలు విశేషమని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితమంతా అంకితభావంతో పనిచేసి సహచరులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో శేష జీవితం గడపాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు అధికారులు మాట్లాడుతూ సింగరేణిలో సాప్ ఆన్‌లైన్ కంప్యూటరీకరణ విధానాన్ని అమలు చేయడంలో రఘురామిరెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎస్టిపిపి జీఎం మదన్ మోహన్, ఏజీఎం (ఈ అండ్ ఎం) సూర్యనారాయణ రాజు, సీఎంఓఏఐ బ్రాంచ్ కార్యదర్శి సంతోష్ కుమార్, డీజీఎం (ఫైనాన్స్) బి. శ్రీధర్, డీజీఎం (ఎఫ్‌జీడీ) మహేందర్, డీజీఎం (వాటర్ సిస్టం) జనగామ శ్రీనివాస్, పర్సనల్ విభాగాధిపతి ఎస్వీ రాజేశ్వర్ రావు, ఎస్వో టు ఈడీ వెంకటయ్య, ఎస్వో టు జీఎం శంకర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు ఇవ్వాలి

**మున్సిపాలిటీ అభివృద్ధికి సీడీఎంఏకు వినతి**

**ఆసిఫాబాద్‌కు ప్రత్యేక ప్యాకేజీ కోరిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్**





**ఆసిఫాబాద్ జూన్ 23 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం కోరిన మున్సిపల్ పాలక వర్గం ఆసిఫాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండీ అహ్మద్ రాష్ట్ర పురపాలక పరిపాలన శాఖ కమిషనర్ డాక్టర్ టి.కె. శ్రీదేవి, జేడీ పల్గున్ కుమార్‌లకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లో వారిని కలిసి మున్సిపాలిటీలో సిబ్బంది కొరత, మౌలిక వసతుల సమస్యలను వివరించారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక నిధులు అవసరమని కోరారు. అలాగే చెత్త సేకరణ కోసం 15 వాహనాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సిబ్బంది కొరతను త్వరలోనే పరిష్కరిస్తామని, నూతన మున్సిపాలిటీ కావడంతో ప్రత్యేక నిధుల మంజూరుకు ప్రాధాన్యత ఇస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## ఓటర్ జాబితా సవరణ పై అవగాహన





**నేరడిగొండ జూన్ 23( ప్రజాజ్యోతి):**ప్రత్యేక సమగ్ర సవరణ ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమం అమలుకు సంబంధించి నేరడిగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో బి ఎల్ ఓ లు, బి ఎల్ ఏ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేరడిగొండ తహసీల్దార్ ఖలీమ్, బోథ్ తహసీల్దార్ సుభాష్ హాజరై ఎన్నికల సంఘం మార్గదర్శకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జూన్ 25, 2026 నుంచి జూలై 24, 2026 వరకు మండలంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ బి ఎల్ ఓ లు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఓటరు జాబితాలో పేర్ల చేర్పు, తొలగింపు, సవరణలు, చిరునామా మార్పులు తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు బి ఎల్ ఓ లు, బి ఎల్ ఏ లకు విధులు, బాధ్యతలపై సమగ్ర అవగాహన కల్పించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఇంటింటి సర్వే సమయంలో బి ఎల్ ఓ లకు అవసరమైన సమాచారం అందించి సహకరించాలని, ఓటరు జాబితాలో తమ వివరాలు సక్రమంగా నమోదయ్యేలా చూసుకోవాలని అధికారులు కోరారు.

## పదోన్నతిపై వెళ్తున్న అదనపు జిల్లా న్యాయమూర్తికి ఘన సన్మానం



**మంచిర్యాల, 23 జూన్ (ప్రజా జ్యోతి):**పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న సందర్భంగా అదనపు జిల్లా న్యాయమూర్తి లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్‌కు మంచిర్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘన సన్మానం, వీడ్కోలు కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా న్యాయమూర్తి లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ, మంచిర్యాల బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఎంతో సమర్థవంతంగా విధులు నిర్వహించారని ప్రశంసించారు. ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల్లో వస్తున్న వివిధ రకాల కేసులపై న్యాయవాదులు మరింత అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే మంచిర్యాలలో తనతో కలిసి పనిచేసిన న్యాయవాదులను తాను ఎక్కడికి వెళ్లినా మరచిపోనని, వారి ప్రేమాభిమానాలు ఎప్పటికీ తనకు గుర్తుండిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త సత్తయ్య, సదానందం, రవీందర్ రావు, పులి రాయమల్లు, గడ్డం శ్రీనివాస్, ఆకుల రవీందర్, దండనాయకుల మనోహర్, రంగు మల్లేష్, తుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన మూడో విడత అడ్మిషన్ల ప్రక్రియ..





**బాసర జూన్ 23(ప్రజా జ్యోతి),** తెలంగాణలోని బాసర రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ట్రిపుల్ ఐటీ)లో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి పీయూసీ మొదటి సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ మంగళవారంతో ముగిసినట్లు యూనివర్సిటీ పీఆర్వో బాలకృష్ణ తెలిపారు. మూడో విడత కౌన్సెలింగ్‌లో 159 మంది విద్యార్థులకు అడ్మిషన్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. మొదటి విద్యార్థికి ప్రవేశ పత్రాన్ని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గోవర్ధన్ అందజేశారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ, యూనివర్సిటీలో విద్యార్థుల కోసం సెల్‌ఫోన్ వినియోగంపై నిషేధం అమలులో ఉన్నట్లు తెలిపారు. తరగతి గదులు, గ్రంథాలయం (లైబ్రరీ), మెస్ తదితర ప్రాంతాల్లో ఈ నిబంధన అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందించడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ నిబంధనలను గమనించి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యా సంస్థలలో నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేయాలి

-- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల, జూన్ 23 (ప్రజా జ్యోతి):**సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని, ఈ క్రమంలో విద్యార్థులకు గుణాత్మక విద్య అందించే దిశగా అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యారంగాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు చేపడుతోందన్నారు.క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు తమ పరిధిలోని పాఠశాలలను ప్రతిరోజు తప్పనిసరిగా సందర్శించి విద్యార్థుల అభ్యసన ప్రమాణాలను పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థుల చదవడం, రాయడం, మాట్లాడడం వంటి అంశాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల సముదాయ సమావేశాలలో చర్చించిన అంశాలపై నివేదిక రూపొందించాలని, ఉపాధ్యాయుల వారీగా సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధన, ఫలితాల సాధన, విద్యార్థుల హాజరు, పఠన సామర్థ్యాల అభివృద్ధి వంటి అంశాలపై సమగ్రంగా చర్చించాలని అన్నారు.విద్యా రంగ అభివృద్ధిలో భాగంగా నిర్మాణాత్మక చర్యలు చేపడితే విద్యా నాణ్యత ప్రమాణాలు మెరుగు పడటంతో పాటు వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు.ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల బదిలీ ధ్రువపత్రాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయులకు సాధ్యమై నంత వరకు బోధనకు సంబంధించిన విధులనే కేటాయించాలని తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, మధ్యాహ్న భోజన పథకం అమలు, యూడైస్ వివరాల నమోదు తదితర అంశాలపై కూడా సమీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, బోధనేతర సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## దిఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ



**కేరమేరి జూన్ 23 ప్రజా జ్యోతి** కెరమెరి, మండలంలోని చిత్తకర్ర గ్రామ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను మంగళవారం గ్రామ సర్పంచ్ పెందోర్ ఆనందరావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలను జాగ్రత్తగా వినియోగించుకోవడంతో పాటు ప్రతిరోజూ పాఠశాలకు హాజరై క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. విద్యను ఆయుధంగా చేసుకుని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కార్యక్రమం అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు సర్పంచ్ ఆనందరావును శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పటేల్, కారోబార్ వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు

## మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా వ్యవహరించాలి

కళాశాలలో అవగాహన కార్యక్రమం




**ఖానాపూర్ జూన్ 23( ప్రజా జ్యోతి)** మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా వ్యవహరించాలని ఖానాపూర్ సబ్ ఇన్స్పెక్టర్ రాహుల్ గైక్వాడ్అన్నారు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు కార్యక్రమంలో పలు మాదాక ద్రవ్య మత్తు పదార్థాల అంశాలను వివరించి వీటి బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు అన్నారు వాటికి అలవాటు పడి జీవితాలను వమ్ము చేసుకోరాదని కోరారు

# విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన ఉండాలి





జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,జూన్ 23 ,( ప్రజాజ్యోతి )**ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన సాగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని (కేజీబీవీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతిగదిలోని విద్యార్థులతో కలెక్టర్ పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగారు. వారితో లెక్కలు చేయించారు. విద్యార్థులు పాఠాలను సులువుగా అర్థం చేసుకునే మెలుకువలు నేర్చుకోవాలన్నారు. సామాజిక అంశాల్లో భాగస్వామ్యం అవుతూ పలు విషయాల్లో అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు నేర్పిస్తున్న చదువు, అందిస్తున్న భోజనం సక్రమంగా ఉన్నాయో లేవో వారిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, పిల్లలకు చదువుతో పాటు, నైపుణ్యాభివృద్ధి తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు వచ్చే సందేహాలు నివృత్తి చేస్తూ ఉండాలని తెలిపారు. ప్రతి రోజు అన్ని పూటల కామన్ మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని చెప్పారు. విద్యార్థులకు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. అనంతరం ఖానాపూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని చెప్పారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఏవైనా భూ సమస్యలు ఉన్నాయేమో అని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలలో డిఈఓ భోజన్న, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ తాసిల్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా




**ఖానాపూర్ జూన్ 23( ప్రజా జ్యోతి)** నిర్మల్ జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా ఖానాపూర్ పర్యటనలు సందర్భంగా స్థానిక తహసిల్ కార్యాలయంలో ఆకస్మికంగా రికార్డులను మంగళవారం తనిఖీ చేశారు కార్యాలయ వ్యవహారాల పట్ల రైతులకు రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు పారదర్శకంగా వ్యవహరించి పనులు చేయాలని కలెక్టర్ అన్నారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సుజాత రెడ్డి డిప్యూటీ తాసిల్దార్ మంజుల ఆర్ఐ నగేష్ సర్వేయర్లు కిషన్ లకు పలు సూచనలు చేశారు ఈ ప్రాంతంలో గల పలు ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో అంద జేయాలని ఆదేశించారు

## విత్తనాల పంపిణీ చేసిన

**ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం**



**ఖానాపూర్ జూన్ 23(ప్రజాజ్యోతి)** ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు సత్తనపల్లి రైతు వేదికలో జరిగిన రైతు విత్తన మేళా కార్యక్రమంలో విత్తనాలు పంపిణీని ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను మాత్రమే ఎంచుకోవాలని సూచించారు కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు రాజుర సత్యం మండల అధ్యక్షులు జంగిలి శంకర్ శ్రీపాద శేషాద్రి బాలసంకుల రాజేందర్ ఏ డి ఏ సుజాత ఏ ఓ జగదీశ్వర్ ఏఈఓ రజిత నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు

## యువత ఆరోగ్యకర మైన జీవనశైలి కోసం ఈ క్రీడా పోటీలు

**జిల్లా సంక్షేమ అధికారి మిల్కా**

**ఆదిలాబాద్ లో ఘనంగా నషా ముక్త్ భారత్ సప్తాహ్ క్రీడా పోటీలు**





**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 23, (ప్రజా జ్యోతి)**యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి వ్యసనాల బారిన పడకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరు చుకోవాలనే ముఖ్య లక్ష్యంతో అంతర్జాతీయ మాదక ద్రవ్యా ల వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం ( నషా ముక్త్ భారత్) కార్యక్రమం ని ర్వహిస్తున్నట్లు ఇందులో భా గంగా అవగాహన కల్పించేం దుకు క్రీడా పోటీలు నిర్వహిం చడం జరిగిందని సంక్షేమ అ ధికారి మిల్కా తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవా ణావ్యతిరేక దినోత్సవం-- 2026 (నషా ముక్త్ భారత్ సప్తా హ్) లో భాగంగా స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం ప్రత్యేక క్రీడా పోటీలు నిర్వహించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, వ్యసనాల బారిన పడకుండా ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరుచుకోవాలనే ముఖ్య లక్ష్యంతో ఈ కార్యక్ర మాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మిల్కా మాట్లాడుతూ యు వతులకు 400 మీటర్ల రన్నింగ్, అలాగే యువకులకు 400, 800 మీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహించగా యువత ఉ త్సాహంగా పాల్గొన్నారని తెలి పారు. క్రీడలు శారీరక, మాన సిక ఆరోగ్యాన్ని పెంపొందించ డమే కాకుండా, యువతను పెడదోవ పట్టకుండా కాపాడ టంలో కీలక పాత్ర పోషిస్తా యన్నారు. కాగా, ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈ నెల 25న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ క్రీడా పోటీల కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి దయానంద్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ క్రీడల అధికారి పార్థ సారథి, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ సాయి కుమార్, యువతీ యువ కులు, ఇతర అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఆడే గజేందర్





**నేరడిగొండ జూన్ 23 (ప్రజాజ్యోతి):**ఆదిలాబాద్ జిల్లా (డీసీసీ) అధ్యక్షుడు నరేష్ జాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ జాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ... డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన మరిన్ని సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నరేష్ జాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ శ్రేయస్సు కోసం, భవిష్యత్ విజయాల కోసం ఆయన నాయకత్వంలో మరింత కృషి చేయాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించారు.

# విద్యార్థులు 100% హాజరు కావాలి నాణ్యమైన భోజనం, వసతులు కల్పించాలి

**మస్కాపూర్ కస్తూర్బా పాఠశాలను పరిశీలిన**

**జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా**



**ఖానాపూర్ జూన్ 23 (ప్రజా జ్యోతి )** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని కేజీబీవీ కస్తూర్బా బాలికల మస్కాపూర్లో గల పాఠశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా పరిశీలించారు పాఠశాల పరిసరాలను పూర్తిగా సందర్శించి వసతుల పట్ల ఆరా తీశారు పారిశుద్ధ భోజనంతోపాటు చక్కటి వసతి కల్పించాలని పాఠశాల కూలిన ప్రహరీ గోడను యుద్ధ ప్రతిపాదికన నిర్మించిన తీరును పరిశీలించారు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలక్కుండా సంబంధిత మండల స్థాయి విద్యాధికారులు కస్తూర్బా సిబ్బంది పనితీరు పట్ల ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండి సంబంధించిన సమాచారాన్ని జిల్లా విద్యాశాఖ గారి ద్వారా తమకు తెలియజేయాలని ఆదేశించారు తరగతి గదిలో విద్యార్థుల ప్రతిభ పాటవాలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా పలు సూచనలు సలహాలను తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి భోజన్న మండల విద్యాధికారిని సంధ్యారాణి ఎంపీడీవో రాథోడ్ రాధా ఎమ్మార్వో సుజాత రెడ్డి సర్పంచ్ దొనికని లక్ష్మి మస్కాపూర్ కార్యదర్శి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు పాఠశాల వసతులను పూర్తిగా మండల ఎంఈఓ సంధ్యారాణి జిల్లా కలెక్టర్ కు వివరించారు

# డ్రగ్స్ మరియు సైబర్ క్రైమ్ పైన అవగాహన కల్పించిన ఎస్సై రవీందర్



**దిలావర్ పూర్ , జూన్ 23 ,( ప్రజాజ్యోతి ).** దిలావార్ పూర్ మండల కెంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం డ్రగ్స్ నిరోధం మరియు సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించారు డ్రగ్స్ ను అరికట్టడానికి నిరంతరం కఠిన చర్యలు చేపడుతున్నామని ఎస్సై రవీంధర్ అన్నారు. డ్రగ్స్ వాడటం వల్ల అనేక మంది జీవితాలను నాశనం చేసుకొని వారి తల్లిదండ్రులను తీరని క్షోభకు గురి చేస్తున్నారని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన వారు జీవితంలో బాగుపడిన ధాఖలాలు లేవని చెప్పారు. ఏలాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా నిత్యం చదువు పై దృష్టి సారించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగాలని సూచించారు. సైబర్ నేరాలకు పాల్పడే వారి కి కటిన శిక్షలు ఉన్నాయని చెప్పారు. తగు జాగ్రత్తలు తీసుకొని సైబర్ మోసాలకు గురికాకుండా చూసు కోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఎ. నాగాభూషణం, ఉపాధ్యాయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఇందూరు జిల్లా మొత్తం విజయవంతంగా పాఠశాలల బంద్ నిర్వహించడం జరిగింది

**ప్రైవేట్,కార్పొరేట్ విద్యా మాఫియాకు బ్రాండ్ అంబాసిడర్ లా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి...**
**రేషనలైజేషన్ పేరుతో 23000 ప్రభుత్వ స్కూళ్ల మూసివేతకు కుట్ర...**
**ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల విచ్చలవిడి ఫీజుల దోపిడీకి ప్రభుత్వం రెడ్ కార్పేట్...**
**అటకెక్కిన విద్యాహక్కు చట్టం...ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు...**
**ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు ఇంకా అందని స్కూల్ యూనిఫామ్స్...**





**మామడ జూన్ 24 ( ప్రజా జ్యోతి)**ఈ సందర్భంగా ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశీధర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్య నిర్వీర్యం అవుతున్నది.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉండి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు బ్రాండ్ అంబాసిడర్గా వ్యవహరిస్తున్నాడని, ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్ర చేస్తూ... ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో జూన్ 23న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్. విజయవంతం రేవంత్ రెడ్డి పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలని కుట్ర చేస్తున్నాడని, అందుకే రేషనలైజేషన్ పేరుతో 23000 ల పాఠశాలలను మూసేందుకు కంకణం కట్టుకున్నాడని,ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఏజెంట్ లా వ్యవహరిస్తున్నాడని, విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం రెడ్ కార్పేట్ పరిచిందని ఎద్దేవా చేశారు.వెంటనే ప్రభుత్వం ఫీజుల దోపిడీని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు,కార్పొరేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచితంగా 25% సీట్లను అందించే విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. రాష్ట్రంలో పాఠశాలలు పర్యవేక్షణ లేకుండా నడుస్తున్నాయని కావున ఖాళీగా ఉన్న ఎంఈఓ,డిఈఓ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక పర్మిషన్ పేరు మీద పలు బ్రాంచు లు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి ఆర్థిక దోపిడీకి పాల్పడుతు సరస్వతి నిలయాలు లాంటి పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ఖాళీగా ఉన్న టీచింగ్,నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అదేవిధంగా గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని, ఫుడ్ పాయిజన్ కి తావులేకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని,చీజూ 2020ని,విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పాఠశాలలు రీ ఓపెన్ అయిన ఇంతవరకు విద్యార్థులకు స్కూలు యూనిఫామ్స్ ఇవ్వకపోవడం రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థ పై చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో “బ్రేక్ ఫాస్ట్ స్కీమ్” ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ విద్యా వ్యవస్థను గాడి పెట్టాలని ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల ఆర్థిక దోపిడిని నియంత్రించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.విద్యార్థి వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నటువంటి రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 23న ఏబీవీపీ పాఠశాలల బందుకు పిలుపునిచ్చింది.కావునా విద్యార్థులు,వారి తల్లిదండ్రులు ఈ బంద్ కు సహకరించి విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గ దాస్, కూనల్, సశీజయ్, వినయ్, రాజకుమార్, రాజేష్, చింటూ, యోగేష్, చరణ్, రాజు, రితేష్, రవికిరణ్, బమేష్, లికేష్, మున్నా, అభి తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో 100 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి, అర్హులందరికీ ఇండ్లుఇస్తాం

## ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వెల్లడి




**ఖానాపూర్ జూన్ 23 (ప్రజాజ్యోతి)** మండలంలో వంద ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారని అరుపులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేందుకు ప్రజా ప్రభుత్వం రెడీగా ఉందని ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు మండలంలోని మారుమూల ఆదివాసి గ్రామమైన సారంగాపూర్ లో ఇంద్రమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు త్వరలోనే సామూహిక గృహప్రవేశాలు చేయిస్తామని ఎలాంటి ఓడు దొడుగులు లేకుండా సంబంధిత అధికారులను సంప్రదిస్తూ ఇళ్ల నిర్మాణాలు సాఫీగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు తెలిపారు మండలంలో 100 ఇండ్లు నిర్మాణం పూర్తి చేసుకున్న సందర్భంగా ఇందిరమ్మ ఇంటి నమూనా లో తయారు చేయించిన కేకును కట్ చేసి ప్రజలకు పంచారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాథోడ్ రాదా హౌసింగ్ అధికారి ఇందిరమ్మ లబ్ధిదారులు ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజీద్ కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షులు రాజురాసత్యం మండల పార్టీ అధ్యక్షులు జంగిలి శంకర్ గొర్రె గంగాధర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## రైతు వేదిక నందు విత్తన మేల




**దిలావర్ పూర్ , జూన్ 23 ,( ప్రజాజ్యోతి ).**ఈ రోజు దిలావర్పూర్ రైతు వేదిక నందు విత్తన మేల కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బంచపల్లి చైర్మన్ శ్రీ వెంకటరమణారెడ్డి,స్థానిక సర్పంచ్ అక్షరా అనిల్,ప్రారంభించడం జరిగింది ప్రభుత్వం నిర్దేశించిన 7 సన్న రకాల వడ్లు లో నాలుగు రకాలు స్వల్పకాలిక రకాలైన కంది సోయాబీన్ మరియు కూరగాయ విత్తనాలు ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్ ఫామ్ ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో విత్తన డీలర్లు రైతులు పాల్గొన్నారు

# బైక్ స్టంట్లు చేసి సోషల్ మీడి యాలో వీడియోలు పోస్టు చేసిన యువకులపై కేసు నమోదు

**ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే ప్రమాదకర విన్యాసాలకు పాల్పడితే కఠిన చర్యలు**

**స్కూటీ స్వాధీనం**

**మావల ఎస్ హెచ్ ఓ బి.డి. ప్రేమ్ కుమార్**






**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 23, (ప్రజా జ్యోతి)**బైక్ స్టాంట్లు చేసి సోషల్ మీ డియాలో వీడియోలు పోస్ట్ చేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు మావల ఎస్ హెచ్ ఓ బిడి ప్రేమ్ కుమార్ తెలిపారు. మావల పోలీస్ స్టేష న్ పరిధిలో కొందరు యువకులు బహిరంగ రహదారులపై ప్రమాదకరంగా బైక్ స్టంట్లు, వీలింగ్‌లు నిర్వహిస్తూ వాటికి సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, సోషల్ మీడియా మానిటరింగ్ ఆధారంగా సంబంధిత వ్యక్తులను గుర్తించి మోటార్ వాహనాల చట్టంలోని నిబంధనల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ బి.డి. ప్రేమ్ కుమార్ తెలిపారు. ఇలాంటి ప్రమాదకర విన్యాసాలు చేసే వారు తమ ప్రాణాలతో పాటు ఇతర వాహనదారులు, పాదచారుల ప్రాణాలకు కూడా ముప్పు కలిగిస్తున్నారని పేర్కొన్నారు. బైక్ స్టంట్లు, వీలింగ్‌లు, అతి వేగంగా వాహనాలు నడపడం, వాటి వీడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేయడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. స్కూటీ స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.తల్లి దండ్రులు తమ పిల్లలకు రోడ్డు భద్రత, బాధ్యతాయుతమైన డ్రైవింగ్, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించాలని, రోడ్లను స్టంట్ల కోసం కాకుండా సురక్షితర వాణా కోసం మాత్రమే ఉప యోగించాలని కోరారు.

## స్వర్ణ రైతు వేదికలో విత్తన మేళా సఢస్సు



**సారంగాపూర్, జూన్ 23,(ప్రజా జ్యోతి** మండలంలోని స్వర్ణ రైతు వేదికలో విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ ఈ ఓ, బి. రాము మాట్లాడుతూ వర్ష కాలంలో పంట సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు మేలైన వరి విత్తనాలు ప్రభుత్వ అందించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసింది. ప్రభుత్వం ఏడు రకాలైన వరి విత్తనాలు ఇవ్వడం జరుగుతుందని వాటికి మాత్రమే రైతులు పంట పొలాల్లో వేసుకోవాలని, వాటికే ప్రభుత్వం ప్రకటించి సబ్సిడీ, గిట్టు బాటు ధరలు వర్తిస్తాయని, ఎలినో ప్రభావంతో ఈ విత్తనాలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిందని అన్నారు.మీరు సాగు అవసరాలకు అనుగుణంగా నాణ్యమైనవి అని ధ్రువీకరించిన విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని వివరించారు. రైతు వేదికలో రైతులకు విత్తనాల ను అందించరు. క్లస్టర్ పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని. రైతులకు నమ్మకమైన అధిక దిగుబడినిచ్చే విత్తనాలను అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ అబ్దుల్ ఆది, స్థానిక సర్పంచ్ కొత్తింటి మల్లేష్, ఉప సర్పంచ్,క్లస్టర్ లోని రైతులు పాల్గొనరు.

## నిర్మల్ పోలీస్.. మీ పోలీస్

**మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ**

**కృషి చేయాలి ఎస్సై శ్రీకాంత్**






**సారంగాపూర్, జూన్ 23,ప్రజా జ్యోతి** నిర్మల్ జిల్లా యస్.పి డా,, జానకీ షర్మిల ఐపీస్ ఆదేశాల మేరకు బీరవెల్లి గ్రామంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించరు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించరు.ఈ సందర్భంగా స్థానిక ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ..నేటి యువత మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేం దుకు కృషి చేయాలని అన్నారు. యువత ఎటువంటి దురల వాట్లకు బానిస కాకుండా ఉండాలని చెప్పారు.అవగాహన కోసం గోడ పత్రాలు పోలీస్ సిబ్బంది అటించరు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రవి, లింగరావు, గ్రామస్తులు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## పురాతన శివాలయంలో..

## ప్రత్యేక పూజలు చేసిన డీసీసీ అధ్యక్షులు



**గుడిహత్నూర్ జూన్ 23, (ప్రజా జ్యోతి) :** మండల కేంద్రమైన గుడిహత్నూర్ లోని పురాతన శివాలయం లో మంగళవారం జిల్లా డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. జిల్లా ప్రజల సంక్షేమం కోసం దేవుని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా దుతూ అదిలాబాద్ జిల్లా ప్రజలు సుఖశాంతులతో, ఆరోగ్యంగా జీవించాలని, ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతుల సాగు చేస్తున్న పంటల దిగుబడి రావాలని, ప్రతి ఇంట్లో ఆనందం నిండాలని ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధి, ప్రజల ఐశ్వర్యం కోసం ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు గుడిహత్నూర్ మాజీ మండల అధ్యక్షులు అంకత్ రవి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగ్ నాథ్ అప్పా, మహేందర్, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్మికులు సమిష్టిగా హక్కుల సాధన కోసం పోరాడాలి

**భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జంగుల రాజు**



**ఇచ్చోడ, జూన్ 23, (ప్రజా జ్యోతి)**హక్కుల సాధన కోసం కార్మికులందరూ ఏకమై పోరాడి సాధించుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జంగుల రాజు పిలుపునిచ్చారు. మంగళ వారం ఇచ్చొడ మండలంలో భవ న నిర్మాణ కార్మిక సంఘంలో భాగంగా మార్బల్ టైల్ గ్రనైట్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశము (మహాసభ) నిర్వహించారు.భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యద ర్శి గాజంగుల రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన కా ర్యవర్గంను ఖరారు చేశారు. అధ్యక్షునిగా మాధవ్ పాల్వే, ఉపాధ్యక్షులుగా నరేందర్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా లఖన్ సింగ్, సహాయ కార్యదర్శిగా రహమత్, కోశాధికారిగా జితేందర్, సహాయ కోశాధికారి కైలాస్, రమేష్ ఏడుగురు కార్యవర్గ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్ర మంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు బదర్ చౌష్, ఇచ్చోడ మండల ఏఐ టియుసి కార్యదర్శి కల్లేపల్లి గంగయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం ఇచ్చోడ మండల అధ్యక్షులు బోదాసు రవి, ప్రధాన కార్యద ర్శి బొజ్జ రాజ్ కుమార్, అర్జున్ తదితరులు పాల్గొని దాదాపు 100 మంది కార్మికులు ఈ స మావేశానికి హాజరయ్యారు. ప్రతి ఒక్కరూ లేబర్ కార్డు, యూనియన్ సభ్యత్వం కార్డు తీసుకోవాలని సరైన రేట్లతో సక్రమ పద్ధతిలో పని చేయా లని పిలుపు నిస్తూ కార్మికులం దరూ మమేకం కావాలని ప్రతి నెల ఒకటో తారీకు రోజున ప ని బందు నిర్వహించి కార్మికు లందరూ హక్కులకై సమిష్టిగా పోరాటం చేయాలని రాష్ట్ర కార్యదర్శి గాజంగుల రాజు పిలుపునిచ్చారు.

## తెలంగాణ న్యాయ సేవ ప్రజా చైతన్య సమితి సభ్యులకు పదోన్నతులు



**లక్ష్మణ చాంద, జూలై 23(ప్రజా జ్యోతి)** తెలంగాణ న్యాయ సేవా ప్రజా చైతన్య సమితి రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు తేదీ 23-06-2026 రోజు రాష్ట్ర అధ్యక్షులు చాపల కిరణ్ కుమార్ ఆమోదంతో రాష్ట్ర సహాయ కార్యదర్శి మరియు నియామకాల ఇంచార్జి శ్రీ పుచ్చుల నాగేష్ మంచి పర్ఫామెన్స్ చూపించిన మండల సభ్యులకు ఇచ్చిన హామీ ప్రకారం నియమించారు.లక్ష్మణ చాంద మండల కమిటీ పదవుల నియామకం మంగళవారం రోజున జరిగింది. మండల అధ్యక్షులుగా వేముల రాజు,ప్రధాన కార్యదర్శి ,గుర్ల రంజిత్, మండల సహాయ కార్యదర్శి గుర్ల రవి,జిల్లా సభ్యుడు చుక్కల బాబయ్య, జిల్లా ఉపాధ్యక్షులు,అరటి సత్యం,ఆర్టిఐ సభ్యులు పొలాస గోవర్ధన్,మెరుగు స్వప్న, నాగుల లింగం, ఒస రాజేశ్వర్, లక్ష్మణ చాంద విలేజ్ అధ్యక్షులు, అశోక్, ఎర్ర పోతన్న, అరటి రాజేశ్వర్ ఎన్నికైనట్లు తెలిపారు.

## రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్**

**కడెం మండలంలో రైతులకు విత్తనాలు పంపిణీ**



**కడెం , జూన్ 22 (ప్రజా జ్యోతి)**రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉంటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. కడెం మండల కేంద్రం లోని రైతు వేదికలో విత్తన మేళ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ పాల్గొని, రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు అందించడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం అన్నారు. రాష్ట్రంలో రైతులకు అండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం నిలుస్తున్న ప్రతిపక్షాలు చేస్తు న్న తప్పుడు ప్రచారాలను ప్రజలు,రైతులు నమ్మొద్దని అన్నారు. రెండు రోజుల క్రితమే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రైతుల నుండి కొనుగోలు చేసిన వడ్ల డబ్బులు రైతుల ఖాతాలో జమ అయ్యాయి అన్నా రు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పతకాలను ప్రజలు గుర్తించి ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్ర మంలో అధికా రులు,రైతులు,స్థానికులు,కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## కాంట్రాక్ట్ పోస్టు దరఖాస్తుకు ఆహ్వానం

**నిర్మల్ జిల్లా,జూన్ 23,(ప్రజా జ్యోతి )**నిర్మల్ జిల్లా కేంద్రం లోని ఖానాపూర్ మహాత్మ జ్యోతిబాపూ రావు పూలే బాలికల పాఠశాలలో శనిటరీ పోస్టు( 1) మహిళ కు కాంట్రాక్టు పద్ధతి లో దరఖాస్తులు కోరాబడుచున్నవి. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, బ్యాంకు పాసుబుక్, పాన్ కార్డు, 2 పాసుఫోటో సైజు ఫోటోలు తీసుకొని తేదీ 24-06-2026 నుండి 26-06-2026 తేది వరకు సాయంత్రం 5 గంటల వరకు నిర్మల్ లోని ఇంటి నెం. 7-1-47, పంజేష గల్లీ, బి. అనిల్ ను సంప్రదించ గలరు. గమనిక ఇట్టి ఉద్యోగ ప్రకటనలో సవరణలు లేదా రద్దు పర్చుటకై ప్రెసిడెంట్ అనిల్ మాన్ పవర్ వెల్ఫేర్ సొసైటీ గారికి సంపూర్ణ అధికారం కలదు. పూర్తి వివరాలకు 7075750751. ఫోన్ నెంబర్ సంప్రదించాలని కోరారు

# నైపుణ్య అభివృద్ధికి డ్యూటీ మీట్‌లు దోహదపడతాయి

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీసు సిబ్బందికి 11 విభాగాలలో పరీక్షలు

ఫోరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టి గేషన్, ఫింగర్ ప్రింట్స్, డాగ్ స్క్వాడ్, యాంటీ సబటేజ్ చెక్, కంప్యూటర్ అవేర్‌నెస్ తదితర అంశాలలో పోటీలు

స్వయంగా ఫింగర్ ప్రింట్స్ తీ సి సిబ్బందికి శిక్షణ అందించిన జిల్లా ఎస్పీ

రిబ్బన్ కట్ చేసి డ్యూటీ మీట్ ప్రారంభoదంరాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కన బరచాలని సూచన





**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 23, (ప్రజా జ్యోతి)**నైపుణ్య అభివృద్ధికి డ్యూటీ మీట్లు ఎంతో దోహద పడతా యని జిల్లా ఎస్పీ అఖిల్ మ హాజన్ స్పష్టం చేశారు. రా ష్ట్రంలో నిర్వహిస్తున్న పోలీ సు డ్యూటీ మీట్‌లో భాగంగా జిల్లాస్థాయి డ్యూటీ మీట్ ను ఆదిలాబాద్ జిల్లా పోలీసు హె డ్ క్వార్టర్స్‌లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మా ట్లాడుతూ, పోలీసు అధికారులు, సిబ్బంది నైపుణ్యాలను పెంపొందిం చేందుకు డ్యూటీ మీట్‌లు ఎంతో ఉపయోగకర మని తెలిపారు. జిల్లా స్థాయి లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జోనల్, రాష్ట్ర, జాతీ య స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని పే ర్కొన్నారు. ఈ డ్యూటీ మీట్ లో ఫోరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, క్రిమినల్ లాస్, మెడికో లీగల్ టెస్ట్, ఫింగర్ ప్రింట్ సైన్స్, లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎగ్జిబిట్స్, క్రై మ్ సీన్ ఫోటోగ్రఫీ, పోలీస్ పోర్ట్రెయిట్, అబ్జర్వేషన్ టెస్ట్ (ప్రాక్టికల్ రాత పరీక్ష), యాంటీ సబటేజ్ చెక్, డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్, కంప్యూ టర్ అవేర్‌నెస్ కాంపిటీషన్ వంటి అంశాలలో పరీక్షలు, పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేరస్థల పరిశోధన, శాస్త్రీయ ఆధారాల సేకరణ, ఫింగర్ ప్రింట్ల గుర్తింపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, వీడియో, ఫోటో ఆధారాల విశ్లేషణ, బాంబు గుర్తింపు, భద్రతా తనిఖీలు వంటి అంశాలపై సిబ్బందికి ప్రాక్టికల్, రాత పరీక్షలు నిర్వహిం చడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో నేర స్థలు ఉపయోగిస్తున్న కొత్త పద్ధతులను తెలుసుకొని, నూతన చట్టాలపై అవగాహన పెంపొం దించుకొని, తమ విధుల్లో మరింత సమర్థవంతంగా పని చేసేలా ఈ డ్యూటీ మీట్‌లు ఉపయోగ పడతాయని పేర్కొ న్నారు. ట్రైనింగ్‌లో నేర్చుకు న్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసే విధంగా అనుభ వాన్ని పెంపొందించు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్వయంగా ఫింగర్ ప్రింట్లు తీసే విధానాన్ని ప్రదర్శించి సిబ్బందికి శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు పి. మౌనిక ఐపీఎస్, బి. సురేందర్ రావు, డీఎస్పీలు ఎల్. జీవన్ రెడ్డి, కమతం ఇంద్రవర్ధన్, ఇన్స్పె క్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, ఫింగర్ ప్రింట్, ఎన్ ఐ బి, డీసీఆర్‌బీ, బీడీ టీం, డాగ్ స్క్వాడ్, రిజర్వ్ పోలీసు సి బ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కల్వర్టులను నాణ్యతతో నిర్మించాలి

సిరి చెల్మ లో కల్వర్టు పనుల ను పరిశీలించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ఇచ్చోడ, జూన్ 23, (ప్రజా జ్యోతి)**గుత్తేదారులు రోడ్లు, కల్వర్టులు నాణ్యత గల వస్తు సామాగ్రిలను ఉపయోగించి నిర్మాణాలు చేపట్టా లని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. ఇచ్చొడ మండలంలోని సిరిచెల్మ గ్రామంలో గల ప్రసిద్ధి చెందిన శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ ప్రధాన దారిలో భక్తుల రాకపోకల సౌకర్యం కొరకు రూ. 30 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణ ప నులను మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీ లించారు. నిర్మాణం పూర్తిగా నాణ్యమైన ముడి సరుకు లతో చేపట్టాలని, సదరు కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. అనంతరం మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేశారు. వీరి వెంట మండల నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖానాపూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి నీటి సౌకర్యం కల్పిస్తా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వెల్లడి



**ఖానాపూర్ జూన్ 23(ప్రజాజ్యోతి)** ఖానాపూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు బోర్వెల్స్ ఏర్పాటు చేస్తామనిఅన్నారు ఖానాపూర్ మండలం సత్తెనపల్లిలో నూతన బోర్వెల్ కు మంగళ వారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శంకుస్థాపన చేశారుఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ కూడా నీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడకుండా చూస్తాం అని గ్రామ గ్రామాన మంచినీటి సౌకర్యం కల్పిస్తాం అని ఎమ్మెల్యే గారు అన్నారు.ఈ కార్యక్రమంలో సత్తనపల్లి సర్పంచ్ సిర్ల విజయానంద్ బాబు ఖానాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజీద్ డిసిసి ఉపాధ్యక్షులు రాజుర సత్యం ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం మండల పార్టీ అధ్యక్షులు జంగిలి శంకర్ గ్రామ స్తులు, అధికారులు,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ లో మరణించిన వ్యక్తి కుటుంబానికి ఎన్ ఆర్ ఐ రాష్ట్ర సభ్యుడు మద్దతు

**సారంగాపూర్, జూన్ 23, (ప్రజా జ్యోతి**వైకుంఠపూర్ గ్రామానికి చెందిన లగ్గం జగదీశ్ (38) కొద్ది రోజుల క్రితం ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి అరబిక్ కోళ్లఫారం వద్ద పని చేస్తున్న సమయంలో ప్రమాద వశత్తు ఈనెల 16 తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయ పడి చికత్స పొందుతూ 18 తేదీన హాస్పిటల్ లొ మృతి చెందాడు. జగదీష్ మృతి చెందిన వార్త తెలిసి మంగళవారం ఎన్ ఆర్ ఐ రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు స్వదేశ్ పరికిపండ్ల ఇంటికి వెళ్లగా,ఈ సందర్భంగా మృతుడికి భార్య కవిత 3 లక్షల రూపాయలు మృత దేహం పంపడానికి ఖర్చు అవుతుందని కంపెనీ నిర్లక్ష్యంగా ఉందని తెలుపగ, కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కలిగించి మృత దేహాన్ని త్వరగా ఇండియా తీసుకురావడమే గాక కుటుంబాన్ని అదుకుంటామని అయన హామీ ఇచ్చరు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రొడ్డ మారుతీ, ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ నాయకులు రమేష్, సదా అమృత్, గ్రామస్థులు దేవేందర్, చిన్నయ్యా ఉన్నారు.

## ఆలయ చోరీ ఘటనలో హోంగార్డుల సరెండర్



**బాసర జూన్ 23 (ప్రజా జ్యోతి)**నిర్మల్ జిల్లా, బాసర అమ్మవారి సన్నిధిలోని మహంకాళి ఆలయ చోరీ ఘటనలో మంగళవారం ఆలయ భద్రత విదుల్లో నిర్లక్ష్యం వాయించిన ఐదుగురు హోంగార్డులను సరెండర్ చేయాలని కోరుతూ జిల్లా ఎస్పీకి ఆలయ ఈఓ అంజనీ దేవి లేఖ రాశారు. సోమవారం రాత్రి ఆలయ భద్రత విధుల్లో ఆరుగురు హోంగార్డులకు ఇద్దరు విధులు నిర్వహించారని ఆలయ ఈఓ పేర్కొన్నారు. దీంతో ఐదుగురు హోంగార్డులపై వేటు పాడినట్లు తెలుస్తోంది.

## నేడు ఖానాపూర్ ఎమ్మెల్యే , నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ పర్యటన వివరాలు



**ఖానాపూర్ జూన్ 23 (ప్రజా జ్యోతి)** ఖానా పూర్ నియోజక వర్గ శాసనసభ్యులు నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ నేడు బుధవారం పర్యటన వివరాలు ఎమ్మెల్యే పి ఏ ఒక ప్రకటనలొ ప్రకటించా రు ఉదయం 10 గంటలకు జైనూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో నూతన 12 సముదాయ గదుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారని మధ్యాహ్నం 1 గంటకు నిర్మల్ పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద రాహుల్ గాంధీజీ చేపట్టిన ఛాత్రోన్కి గూంజ్ – కోటికి మద్దతుగా ఏఐసీసీ టిపిసిసి పిలుపుమేరకు కార్యక్రమంలో భాగంగా హాజరవుతారు. మధ్యాహ్నం 2 నర 30 గంటలకు ఖానాపూర్ పట్టణంలోని జెకె ఫంక్షన్ హాల్ లో జరుగు తొంటి రాధా శ్రీనివాస్ రాజు ఎంపిటిసి కౌన్సిలర్ కుమార్తె వివాహానికి హాజరవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు ఖానాపూర్ పట్టణంలో వేద పండితులు చక్రపాణి వాసుదేవా చార్య నరసింహమూర్తిల నూతన గృహప్రవేశానికి హాజరవుతారని తెలిపారు

## ప్రమాదవశాత్తు మరణించిన గ్రామపంచాయతీ కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల బీమా

**చెక్కు అందజేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 23, (ప్రజా జ్యోతి)** ప్రమాదవశాత్తు మరణించిన తరోడ గ్రామపంచాయతీ కార్మికుడు లక్ష్మణ్ భార్య భూ మా బాయికి ప్రభుత్వ నిబంధ నల ప్రకారం మంజూరైన రూ.10 లక్షల గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ (బీ మా) చెక్కును జిల్లా కలెక్టర్ రాజర్షిషా మంగళవారం కలె క్టరేట్ సమావేశ మందిరంలో అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఉద్యోగు లు, కార్మికులు కేవలం రూ. 549 చెల్లించి రూ.10 లక్షల గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ బీమా సౌకర్యాన్ని పొందవ చ్చని తెలిపారు. నిరుపేద కు టుంబాలకు బీమా పథకాలు ఆర్థికంగా అండగా నిలుస్తా యని పేర్కొన్నారు. ప్రమాదాల బారిన పడి కుటుంబ య జమానిని కోల్పోయినప్పుడు ఆకుటుంబం ఆర్థిక ఇబ్బంద ుల్లో కూరుకుపో కుండా ఇలాంటి బీమా నిధులు ఎంతో ఉప యుక్తంగా ఉంటాయని ఆయన తెలిపారు. ఉద్యోగులు, కా ర్మికులు ఈ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మం లో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, పోస్టల్ బ్యాంకింగ్ సర్వీ సెస్ సీనియర్ మేనేజర్ రాజేష్ కుమార్, పంచాయతీ అధికా రి (డీఎల్పీవో) ఫణీందర్ రా వు, పోస్టల్ శాఖ ఉన్నతాధికా రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్-2026 జాబితాలో మీ పేరు ఉండాలంటే ఎన్యుమరేషన్ ఫారం తప్పకుండా నింపాల్సిందే..

**హైద్రాబాద్ :** సర్-2026 (ప్రత్యేక సమగ్రసవరణ(సర్)జాబితాలో మీ పేరు ఉండాలంటే ఎన్యుమరేషన్ ఫారం తప్పకుండా నింపాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. ఏళ్లుగా ఓటేస్తున్నామంటే అలా కుదరదని స్పష్టం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా చేపట్టే ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) కార్యక్రమంలో భాగంగా ఇలా చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి(డీఈవో), జీహెచ్?ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఈ నెల 25 నుంచి హైదరబాద్ మహానగరంలో ఓటరు పత్రాల పంపిణీ మొదలవుతుందని, జులై 24న ముగుస్తుందని తెలిపారు. నెలరోజులపాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఎన్యుమరేషన్ పత్రాలు నింపినవారి వివరాలతో మాత్రమే ముసాయిదా ఓటరు జాబితా తయారవుతుంది. ముసాయిదాలోని ఓట్లపై నెల రోజుల పాటు ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరిస్తామన్న ఆయన ఆయా ఓటర్లకు నోటీసులు ఇస్తామని చెప్పారు. ఓటరు తగు పత్రాలను అందజేస్తే పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు.

**గుర్తింపు కార్డుల అవసరం లేదు**

అక్టోబరు 1, 2026న తుది ఓటరుజాబితా ముద్రిస్తామని, ముసాయిదా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను కూడా ప్రకటిస్తామన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్ ఇంటికి వచ్చిన సమయానికి తాళం వేసి ఉంటే తలుపు, కిటికీల నుంచి పత్రాలను లోపలికి వేస్తారని పేర్కొన్నారు. వాటిలో వివరాలు నింపి సిద్ధంగా ఉంచుకోవాలన్న ఆయన మరో రోజు బీఎల్వో వచ్చి పత్రాలను తీసుకుంటారని పేర్కొన్నారు. ఎన్యుమరేషన్ పత్రాలతో ఎలాంటి గుర్తింపు కార్డులను ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎన్యుమరేషన్ పత్రాన్ని అధికారులు ఇవ్వరు. వారు ఓటరుగా నమోదయ్యేందుకు ఎప్పటిలాగే ఫారం-6 నింపాల్సి ఉంటుంది.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు పరిశీలించిన హౌసింగ్ పీడీ శ్రీనివాస్ రెడ్డి



**సారంగాపూర్, జూన్ 23,ప్రజా జ్యోతి**జామ్ గ్రామంలో మంజూ రైన ఇందిరమ్మ ఇళ్ల స్థలలను హౌసింగ్ పిడి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఆయనతోపాటు ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు, హౌసింగ్ ఏఈ, పంచాయతీ సెక్రెటరీ ఇందిరమ్మ లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 23, (ప్రజా జ్యోతి)**జిల్లాలో ఓటర్ల జాబితా రూపకల్పన, సవరణల ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, ఎలక్షన్ మ్యాపింగ్ ప్రక్రియ ను అత్యంత ప్రతిష్టాత్మ కంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించా రు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరం లో బీఎల్ఓలు, ఎన్నికల విభాగం అధికారులతో నిర్వ హించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూసు కోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్ఓల మ్యా పింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఓటరుకు సంబంధించిన భౌ గోళిక వివరాలు, పోలింగ్ కేంద్రాల దూరం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని మ్యాపింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవా లని ఆదేశించారు. నియోజ కవర్గాల వారీగా బూత్ లెవెల్ అధికారుల పనితీరును నిరం తరం పర్యవేక్షించాలని ఎన్ని కల అధికారులను ఆదేశించారు. డూప్లికేట్ ఓట్లు, మరణిం చిన వారి పేర్లు, ఇళ్లు మారిన వారి వివరాలను గుర్తించి చట్ట నిబంధ నల ప్రకారం జాబితా నుంచి తొలగించాలని, కొత్తగా 18 సంవ త్సరాలు నిండిన యువతీ యువకులను ఓట ర్లుగా నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎలక్షన్ మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి నిర్ల క్ష్యాన్ని సహించ బోమని, నిర్దేశిత గడువులోగా అన్ని పనులు పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఆర్డీవో జగదీశ్వర్‌రావు, ఎన్ని కల విభాగం సూపరింటెం డెంట్ నలంద ప్రియ, తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనర్లు, బూత్ లెవెల్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా 23వ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



**సారంగాపూర్, జూన్ 23,ప్రజా జ్యోతి** మండలంలోని కొట్ల( బి )గ్రామంలో 23వ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయం నిర్మించి 23వ సంవత్సరాలు అయిన సందర్భంగా ఉదయాన్నే పూజా కార్యక్రమాలు నిర్వహించి, సాయంత్రం పల్లకి సేవ గ్రామ వీధులలో ఇదిలా గుండా సాయి బాబా పల్లకిని తిప్పడం జరిగింది. మధ్యాహ్నం అన్నదాన కార్య క్రమం ఆలయ సమీపంలో నిర్వహించరు. అనేకమంది భక్తులు ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని విజయవంతం చేసారు. ఈ కార్యక్రమాన్ని గ్రామంలో గల అన్ని వర్గల కు చెందిన యువ కులు కలిసికట్టుగా ఆలయ వార్షికోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగింది.

## రూ. 35 లక్షలతో సీసీ రోడ్డు ని ర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**కేశవపట్నంలో పర్యటన**

**ప్రభుత్వ పాఠశాలల్లో ఆకస్మిక సందర్శన**





**ఇచ్చోడ, జూన్ 23, (ప్రజా జ్యోతి)**ఇచ్చొడ మండలంలోని కేషవ పట్నం గ్రామంలో మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జా దవ్ పర్యటించారు. ఈ సందర్భంగా కేషవపట్నంలో రూ. 25 లక్షలతో, జోగిపేట్ గ్రామంలో రూ. 10 లక్షలతో సీసీ రో డ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే కు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో ఉన్న స మస్యలను అడిగి తెలుసుకు న్నారు. ఉర్దూ పాఠశాలకు ప్ర హరీ గోడ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లా లోనే అత్యధికంగా విద్యార్థు లు ఉన్న కేషవపట్నం పాఠశాలల్లో ఉపాధ్యాయులను ని యమించడానికి కృషి చేస్తాన న్నారు. ఈ సందర్భంగా ఎ మ్మెల్యే అనిల్ జాదవ్ మా ట్లా డుతూ కేశవపట్నం గ్రామాన్ని నా సొంత గ్రామంగా చూసు కుంటానని అన్నారు. గ్రామంలో నెలకొన్న ప్రతీ సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

# గంజాయి రహిత జిల్లా నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

డ్రగ్స్, మాదక ద్రవ్యాలు, గంజాయి కి వ్యతిరేకంగా ప్రజలు ముందుకు వచ్చిపోరాడాలి

వారం రోజులపాటు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు

గంజాయి అలవాటు ఉన్న యువతకు చికిత్స ద్వారా విముక్తి కల్పించేందుకు చర్యలు

తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో యాంటీ డ్రగ్ అవగాహన సదస్సు

యాంటీ డ్రగ్ సోల్జర్ పోస్టర్ వద్ద ఛాయాచిత్రాన్ని తీసుకొన్న జిల్లా ఎస్పీ






**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 23, (ప్రజా జ్యోతి)**మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవ సరమని, గంజాయి రహిత ఆదిలాబాద్ జిల్లా నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీ ఎస్ అన్నారు. మంగళవారం తలమడుగు మండలం సుంకిడి గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన యాంటీ డ్రగ్ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రజలకు నేరుగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ గంజాయి ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా, సామాజికప రంగా తీవ్ర నష్టాలు కలుగుతాయని తెలిపారు. మాదకద్రవ్యాలకు బానిసలైన వారు కుటుంబాలకు, సమాజానికి దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్ర యోజనాలను కోల్పోయే అవ కాశం ఉందని తెలిపారు. మా దకద్రవ్యాలకు అలవాటు పడిన యువతను గుర్తించి వారికి కౌన్సెలింగ్, వైద్య చికిత్స అందించి సాధారణ జీవితం లోకి తీసుకురావడానికి పోలీ సు శాఖ కృషి చేస్తోందన్నా రు. అదేవిధంగా కల్తీ కల్లు, ఇ తర మత్తు పదార్థాలకు దూ రంగా ఉండాలని ప్రజలకు సూచించారు. డ్రగ్స్‌కు వ్యతి రేకంగా ప్రతి ఒక్కరూ ఉద్య మంలా ముందుకు రావాలని, మాదకద్రవ్యాల విక్ర యాలు లేదా రవాణాపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డ్రగ్స్ వ్యతిరేక యాంటి డ్రగ్ సోల్జర్‌గా పోరాడుతామని ఉన్న పో స్టర్ వద్ద నిలబడి సందేశాన్ని ప్రజలకు చేరవేసేలా ఛాయా చిత్రం దిగారు. ఈ కార్యక్రమం లో సుమారు తలమడుగు, తాంసి మండలాలకు చెందిన 200 మంది యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎ స్పీ ఎల్. జీవన్ రెడ్డి, రూరల్ సీఐ రహీం పాషా, తలమడుగు ఎస్సై డి. రాధిక, తాంసి ఎస్సై ఎస్. జీవన్ రెడ్డి, సుంకిడి సర్పంచ్ నరసమ్మ, ఉప సర్పంచ్ అజయ్, గ్రామ ప్రజలు, యువత, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వం మహిళా సాధికార తకు అత్యంత ప్రాధాన్యత

జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 23,( ప్రజా జ్యోతి)** ప్రభుత్వం మహిళా సాధికార తకు అత్యంత ప్రాధాన్యతని స్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ గ్రామీణ మండ లంలోని మామిడి గూడ గ్రామంలో నూతనంగా విలేజ్ ఆ ర్గనైజేషన్ భవన నిర్మాణ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజ రై భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, అందులో భాగంగానే గ్రామాల పరిధి లో అన్ని వసతులతో కూడిన సంఘ భవనాల నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. మామిడిగూడ గ్రామంలో నిర్మించనున్న ఈ వివో బిల్డింగ్ పనులను నిర్ణీత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల ప్రతినిధులు నిర్మాణ పనులను పర్యవే క్షించాలని సూచించారు. గ్రా మీణ మహిళలు సంఘాల ద్వారా పొందుతున్న ప్రభుత్వ పథకాలను, రుణా అవసరా న్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరో హించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల బలోపేతానికి, వారి ఆర్థిక స్వాలంబనకు ఈ వివో భవనాలు ఎంతగానో దోహద పడతా యని, మహిళలు ఒకే చోట సమావేశమై తమ సం ఘాల పురోగ తిపై చర్చించుకో వడానికి, భవిష్యత్తు ప్రణాళిక లు రూపొంది ంచుకోవడానికి ఈ భవనం ఒక వేదికగా నిలు స్తుందని ఆశాభా వం వ్యక్తం చేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్ పరిశీలించి, వైద్య సేవలపై వివరాలను అడిగి తెలు సుకున్నారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దార్ గోవింద్, అధికారులు, గ్రామస్తులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు ముంగట్లోకి నాణ్యమైన విత్తనాలు

విత్తన మేళా కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు మంత్రుల సలహా లు, సూచనలు





**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 23, (ప్రజా జ్యోతి)** రైతు ముంగిట్లోకి నాణ్యమైన విత్తనాలు” అందించడమే ప్ర భుత్వ ముఖ్య ఉద్దేశమని జి ల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం ఆదిలాబా దు గ్రామీణ మండలం అంకోలి రైతు వేదికలలో నేటి నుండి జూన్ 30, 2026 వరకు వారం రోజుల పాటు నిర్వహించనున్న “విత్తన మేళా” కార్యక్ర మానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు కలెక్టర్ విత్తనాలను అందజెసి, సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ విత్తన మేళా ప్రారంభోత్సవ కార్యక్ర మం సంద ర్భంగా రాష్ట్ర వ్యవసాయ శా ఖ మంత్రి తుమ్మల నాగే శ్వర రావు, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్న తాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికా రులకు, రైతు లకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రు లు మా ట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా రైతాంగానికి సాగు సీజన్ ప్రారం భంలోనే విత్తనాలు, ఎరు వుల కొరత లేకుండా చూడాలని వ్యవసా య శాఖ అధికా రులను ఆదేశించారు. రైతు వేదికలను వేదికగా చేసుకుని శాస్త్రవేత్తలు, అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు నిరం తరం అందుబాటులో ఉంటూ ఆధునిక సాగు పద్ధతులపై, నానో ఎరువుల వాడకంపై విస్తృతంగా అవగాహన కల్పించా లని దిశాని ర్దేశం చేశారు. ఈవీడియో కాన్ఫరెన్స్ అనంత రం రైతులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వానాకాలం పంటల సాగుకు సిద్ధమవు తున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సన్న వడ్లు, పప్పుదిను సులు, నూనె గింజలు వివిధ రకాల కూ రగాయల నాణ్యమైన విత్త నాలను రైతు వేదికల ద్వారా నేరుగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దళారులను ఆశ్ర యించి నకిలీ విత్తనాలతో మోసపోకుండా, ప్రభుత్వం అందిస్తున్న ఈ సువర్ణ అవ కాశాన్ని జిల్లాలోని రైతాంగ మంతా సద్వినియోగం చేసు కోవాలని కోరారు. వ్యవసా య రంగం లో వస్తున్న ఆధు నిక మార్పులను రైతులు అం దుకోవాలని సూచి స్తూ, ఇఫ్కో సంస్థ ప్రవేశపెట్టిన నానో ద్రవ ఎరువుల వినియోగంపై ఆయన ప్రత్యేకంగా అవగాహన క ల్పించారు. మార్కెట్లో నానో యూరియా ప్లస్, నానో డి. ఎ. పి తక్కువ ధరకే అందుబాటు లో ఉన్నాయని, ద్రవ ఎరువు ల వాడకం వల్ల పంట నాణ్య త పెరగడమే కాకుండా పర్యా వరణానికి ఎలాంటి హాని జర గదని, భూసారం కూడా దెబ్బ తినదని వివరించారు. స్ప్రే యర్లు, డ్రోన్ల సహాయంతో పొ లాల్లో సులభంగా పిచికారీ చే సుకోవచ్చని, సాంకేతికతను జోడిం చి చేసే వ్యవసాయం వ ల్ల అధిక దిగుబడులు సాధిం చవచ్చని కల ెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్, ప్రారం భోత్సవ కార్య క్రమంలో వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, వ్యవసాయ అధికారి శివ, మండల వ్యవ సాయ అధికారి నాగేష్ రెడ్డి, సర్పంచ్ మాదవి కిషన్, శాస్త్రవేత్తలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.